దిమ్మె కాదు.. మ్యాన్‌హోల్ మూత



నిజామాబాద్ నగరం రోటరీనగర్‌లోని ఒక వీధిలో.. భూగర్భ డ్రైనేజీ అనుసంధానంలో భాగంగా మ్యాన్‌హోళ్ల మూతలను నేలకు రెండు అడుగుల ఎత్తున ఇలా ఏర్పాటు చేశారు. అసలే మట్టిరోడ్డు బురదమయం అవుతుంటే.. వీటిని దాటుకుని ఇళ్లకు ఎలా వెళ్లాలని స్థానికులు వాపోతున్నారు. - ఇందూర్ సిటీ, న్యూస్‌టుడే

మెట్లు ఇలా.. ట్యాంకు ఎక్కేదెలా



ఎడపల్లి మండలం ఎమ్మెస్సీ ఫారంలో తాగునీటి ట్యాంకు మెట్ల వెంట ఏర్పాటు చేసిన రెయిలింగ్ ధ్వంసమైంది. ఈ కారణంగా మెట్లు ప్రమాదకరంగా మారాయి. ట్యాంకు ఎక్కి క్లోరినేషన్ చేయడం పంచాయతీ సిబ్బందికి సాహసంగా మారింది. పైకి ఎక్కేందుకు తీవ్ర అవస్థలు పడుతున్నారు. ఏ మాత్రం ఆదమరిచినా ప్రమాదం జరిగే అవకాశముంది. ధ్వంసమైన రెయిలింగ్‌కు మరమ్మతులు చేపట్టాలని స్థానికులు కోరుతున్నారు. - న్యూస్‌టుడే, ఎడపల్లి

★ బాల్కొండ మండలం వెన్నెల్(బీ) శివారులో వరద కాలువ గట్టుపై కొంతమంది గంజాయి తాగుతున్నారని పోలీసులకు సమాచారం అందింది. వారు ఆకస్మిక తనిఖీలు చేపట్టగా 18 మంది గంజాయి తాగుతూ పట్టుబడ్డారు. వీరికి ఓ బాలుడు సరకు అమ్ముతున్నట్లు తెలుసుకుని పోలీసులు నివ్వెరబోయారు.

★ నిజామాబాద్ ఒకటో ఠాణా పరిధిలో గంజాయి అమ్ముతున్నట్లు సమాచారం రావడంతో స్థానిక పోలీసులు దాడులు నిర్వహించారు. చిన్న ప్యాకెట్లలో సరకు నింపి విక్రయిస్తున్న బాలుడిని అదుపులోకి తీసుకున్నారు.

★ నగరంలోని కోట గల్లీలో కొందరు మైనర్లు మత్తులో అర్ధరాత్రిళ్లు కాలనీల్లో సంచరిస్తున్నారు. స్థానికులను భయభ్రాంతులకు గురిచేస్తున్నారు. బయట పార్కింగ్ చేసిన వాహనాల్లోంచి ఇంధనం చోరీ చేస్తున్నారని కాలనీ వాసులు వాపోతున్నారు.

మత్తు కోరల్లో బాల్యం బందీ

గంజాయి అమ్ముతూ పట్టుబడుతున్న మైనర్లు

న్యూస్‌టుడే, ఇందూర్ సిటీ

జిల్లాలో గంజాయి కోరలు చాస్తోంది. మహమ్మారిని కట్టడి చేయడానికి పోలీస్, ఎక్సైజ్ శాఖలు విశ్వప్రయత్నాలు చేస్తున్నాయి. అయినా, మైనర్లు సైతం ఊబిలో కూరుకుపోవడం కలవరపాటుకు గురిచేస్తోంది.

బాలురను అడ్డుపెట్టుకుని..

గంజాయి తాగే వారి సంఖ్య రోజురోజుకు పెరిగిపోతోందని పోలీస్ శాఖ గణాంకాలు చెబుతున్నాయి. కొన్ని ముఠాలు సరకు విక్రయం కోసం మైనర్లనే అడ్డుపెట్టుకుంటున్నాయి. ఎక్కడైనా దాడులు చేస్తే అసలు నిందితులు తప్పించుకుంటున్నారు. గంజాయి వ్యాపారం చేసే నెట్‌వర్క్ చాపకింద నీరులా విస్తరిస్తోంది. వీరు వాట్సప్ గ్రూప్‌లు ఏర్పాటు చేసి రహస్య భాష(కోడ్)లో కొనుగోలుదారులకు సమాచారం చేరవేస్తున్నారు. ప్రత్యేక అడ్డాలను ఏర్పాటు చేసుకుని దందా సాగిస్తున్నారు. చదువుకు దూరమై, పెద్దల అదుపులేని యువత, మైనర్లనే లక్ష్యంగా చేసుకుని మత్తు పదార్థాలను విక్రయిస్తున్నారు. వారితోనే సరకు సరఫరా చేయిస్తున్నారు. ఈ విష సంస్కృతి నగరంతో పాటు పట్టణాల్లో ఎక్కువ అవుతోంది.

మహమ్మారిని తరిమేయాలంటే..

'ఎవరి పిల్లలో గంజాయికి అలవాటుపడితే మనకెందుకు. ఆ మహమ్మారి మన గడప దాకా రాకుండా ఉంటే చాలు' అనే ధోరణి ప్రజల్లో నాటుకుపోయింది. కానీ, మత్తుకు యువత అలవాటు పడకుండా నిరోధించడం సమాజంలో అందరి బాధ్యత అనే విషయాన్ని విస్మరిస్తున్నారు. బాధిత కుటుంబాలకు అండగా నిలవాలనే స్పృహ కొరవడుతోంది. ఎక్కడ మత్తు పదార్థాల విక్రయాలు జరిగినా, అడ్డాలు కొనసాగుతున్నా బాధ్యత మరువకుండా పోలీసులకు సమాచారం ఇవ్వాలి. మత్తుకు బానిసలైన పిల్లలకు తల్లిదండ్రులు అవసరమైతే వైద్యుల వద్ద చికిత్స అందించాలి. చెడుస్నేహాల బారిన పడకుండా సరైన దిశానిర్దేశం చేయాల్సిన బాధ్యత ముమ్మాటికీ కన్నవారిదే.

పది నుంచి ఎంబీబీఎస్ చదివేవారూ...

మత్తు పదార్థాల విక్రయాలను నిరోధించేందుకు నార్కోటిక్స్ ప్రత్యేక బృందం జిల్లాలో ముమ్మర దాడులు కొనసాగిస్తోంది. 2024 నుంచి 2026, ఆగస్టు వరకు మొత్తం 991 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. మత్తు పదార్థాలు వినియోగిస్తున్న 140 మంది యువకులు, బాలలను గుర్తించారు. వీరిలో పదో తరగతి నుంచి ఎంబీబీఎస్ చదివే విద్యార్థులూ ఉన్నారు. వ్యసనం అలవాటైన వారితో పాటు తల్లిదండ్రులకు సైతం కౌన్సెలింగ్ ఇస్తున్నారు. అవసరమైన వారిని జిల్లా కేంద్రంలోని డీఅడిక్షన్ కేంద్రానికి తరలిస్తున్నారు. త్వరగా కోలుకునేలా ఊతమిస్తున్నారు.

రహదారులు అధ్వానం.. వంతెనలు బురదమయం

పరిశీలన

న్యూస్‌టుడే, నిజామాబాద్ నేరవిభాగం

జాతీయ రహదారులను అనుసంధానించే సర్వీస్ రోడ్లు, అండర్‌పాస్ వంతెనల నిర్మాణం, నిర్వహణపై గుత్తేదారులు అలసత్వం చూపుతున్నారు. ఎన్నిసార్లు విన్నవించినా ప్రజాప్రతినిధులు, అధికారులు తమ గోడును పట్టించుకోవడం లేదనేది వాహనదారుల ఆవేదన. ముఖ్యంగా సర్వీస్ రోడ్లు సరిగా లేనిచోట ప్రమాదాలు నిత్యకృత్యంగా మారాయి. తరచూ ఎవరో ఒకరు ప్రాణాలు కోల్పోతున్నారు. ఈ నేపథ్యంలో.. రోడ్డు ప్రమాదాల నివారణకు కొత్తగా అండర్ పాస్ వంతెనలు నిర్మించాలని.. ఉన్నచోట సరిగా నిర్వహించాలని వివిధ గ్రామాల ప్రజలు కోరుతున్నారు.

	హైవే	రాష్ట్ర
రహదారి ప్రమాదాలు	146	21
మృతులు	65	10
క్షతగాత్రులు	176	23

(వివరాలు.. ఈ ఏడాది ఆగస్టు 14వ తేదీ వరకు)

గన్నారం.. దాటాలంటే భయం

ఇందల్‌వాయి మండలం గన్నారం నుంచి హైవే-44ను అనుసంధానించే రహదారి మీదుగా.. సిర్నపల్లి, స్టేషన్ తండా, నల్లవెల్లి తదితర గ్రామాల ప్రజలు రాకపోకలు సాగిస్తుంటారు. కామారెడ్డి, నిజామాబాద్ వైపు రాకపోకలు సాగించేందుకు ఇటునుంచే వెళ్లాలి. గన్నారం ముఖద్వారం వద్ద అతివేగం కారణంగా తరచూ వాహన ప్రమాదాలు జరుగుతున్నాయి. ఈ ప్రాంతాన్ని పోలీస్ శాఖ బ్లాక్‌స్పాట్‌గా గుర్తించింది. అండర్ పాస్, సర్వీస్ రోడ్లు నిర్మించాలని పలు

హైవేల పక్కనున్న గ్రామాల ప్రజల ఆవేదన పట్టదా?

గ్రామాల ప్రజలు పోలీస్ అధికారులు, టోల్‌ప్లాజా నిర్వాహకులకు ఎన్నోసార్లు విన్నవించారు. - న్యూస్‌టుడే, ఇందల్‌వాయి



అండర్ పాస్ లేకపోవడంతో గన్నారం క్రాసింగ్‌ను ప్రమాదకరంగా దాటుతూ..

తిరిగి వెళ్దామంటే.. పొంచిఉన్న ఆపద



సికింద్రాపూర్ వద్ద అండర్ పాస్‌లో నిలిచిన వర్షపు నీరు

జక్రాన్‌పల్లి మండలం సికింద్రాపూర్ గ్రామం వద్ద జాతీయ రహదారి దాటేందుకు అండర్ పాస్ వంతెన నిర్మించారు. సికింద్రాపూర్, కేశపూర్ తదితర గ్రామాల ప్రజలు ఇటునుంచి రాకపోకలు సాగిస్తుంటారు. వ్యవసాయ క్షేత్రాలకు వెళ్లేందుకు దారి కూడా ఇదే. వర్షం కురిసినప్పుడు వంతెన వద్ద వరద నీరు, బురద చేరుతోంది. కొందరు యూటర్న్ తీసుకుని హైవే దాటబోతూ రోడ్డు ప్రమాదాలకు గురవుతున్నారు. – న్యూస్‌టుడే, జక్రాన్‌పల్లి

సర్వీస్ రోడ్డు లేక సమస్య ...

డిచ్‌పల్లి సమీపంలో హైవే-44ను ఆనుకుని ఉన్న నాకాతండా వాసులు రాకపోకలు సాగించడానికి సర్వీసు రోడ్డు సరిగా లేదు. వర్షాలకు అండర్ పాస్ వంతెన బురదమయం అవుతోంది. వాహనాలు అదుపుతప్పడంతో ఎంతోమంది గాయాలపాలవుతున్నారు. కొత్తగా సర్వీస్ రోడ్డు నిర్మించాలని తండా వాసులు కలెక్టర్‌కు సైతం విన్నవించారు. – న్యూస్‌టుడే, డిచ్‌పల్లి



బురదమయంగా ఉన్న నాకాతండా అండర్‌పాస్

మహిళా శక్తి భవనాల నిర్మాణంలో జాప్యం

న్యూస్‌టుడే, నిజామాబాద్ కలెక్టరేట్ : గ్రామాల్లోని స్వయం సహాయక సంఘాల(ఎస్‌హెచ్‌జీ) మహిళల సమావేశాలకు ఒక వేదిక అంటూ లేకుండా పోయింది. ప్రతి నెలా పంచాయతీ, సామాజిక భవనాల్లోనో.. గ్రూపు లీడర్ నివాసంలోనే చర్చించుకుంటున్నారు. ఈ నేపథ్యంలో ప్రతి పంచాయతీ పరిధిలో 'గ్రామ మహిళా శక్తి' పొదుపు భవనాలను నిర్మించాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఇందులో భాగంగా జిల్లాకు గత ఫిబ్రవరిలో 352 భవనాలను మంజూరు చేశారు. వీటిల్లో ఇప్పటి వరకు పూర్తయ్యింది ఏడు మాత్రమే.

పర్యవేక్షణ కొరవడి.. పురోగతి లేక

☛ ఒక్కో పొదుపు భవనం నిర్మాణానికి వీబీ జీరాంజీ (ఉపాధి హామీ) పథకం కింద రూ.10 లక్షల చొప్పున నిధులు కేటాయించారు. గ్రామంలో సమావేశం నిర్వహించి, తీర్మానం ప్రకారం నిర్మాణ పనులను ఎవరికైనా అప్పగించే అవకాశం ఉంది.

☛ ఆరు నెలలు కావస్తున్నా జిల్లాలో 32 భవనాల పనులు ప్రారంభానికే నోచుకోలేదు. వీటిల్లో 17 చోట్ల స్థలం సమస్య ఉంది. మిగతా వాటిల్లో పునాదుల కంటే తక్కువ స్థాయిలో నిర్మించినవి 108 ఉండగా.. బేస్‌మెంట్ దాటినవి 106 వరకు ఉన్నాయి. మరో 99 నిర్మాణాలు స్లాబ్‌ను పూర్తిచేసుకోవాల్సి ఉంది.

☛ పర్యవేక్షణ బాధ్యతలు చూస్తున్న పంచాయతీ రాజ్, డీఆర్‌డీఏ అధికారులు సమన్వయంతో ముందుకు సాగడం లేదు. అందుకే నిర్మాణాల్లో వేగం మందగిస్తోంది.



'అందరి అండతోనే ఎస్సీ వర్గీకరణ'

మద్నూర్ న్యూస్‌టుడే: ఎమ్మార్పీఎస్‌కు అన్ని పార్టీలు అండగా ఉండటంతోనే ఎస్సీ వర్గీకరణ విషయంలో విజయం సాధించామని ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపకుడు మంద కృష్ణమాదిగ అన్నారు. డోంగ్లీ మండలం హసన్‌టాక్లీ గ్రామంలో ఆదివారం అన్నా భావు సాఠే విగ్రహాన్ని మంద కృష్ణమాదిగ ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. ఎస్సీ వర్గీకరణ విషయంలో సామాజిక న్యాయం ఉండటంతోనే 30 ఏళ్ల పోరాటానికి ఫలితం దక్కిందని గుర్తుచేశారు. మాజీ ఎంపీ బీబీ పాటిల్ మాట్లాడుతూ.. అన్నా భావు సాఠే ఆశయాలు నేటి తరానికి ఆదర్శం అన్నారు. ప్రతీఒక్కరు ఆయన అడుగుజాడల్లో నడవాలన్నారు. మాజీ ఎమ్మెల్యేలు అరుణ తార, హన్మంత్ షిండే, గంగారం పాల్గొని మాట్లాడారు. సమాజంలో భేదాభిప్రాయాలు లేకుండా మెలగాలని సూచించారు. సర్పంచులు దత్తు, లక్ష్మణ్, నాయకులు గజానంద్ దేశాయ్, కృష్ణ పటేల్, తుకారాం తదితరులు పాల్గొన్నారు.



అన్నా భావు సాఠే విగ్రహావిష్కరణ అనంతరం మాట్లాడుతున్న మంద కృష్ణమాదిగ.. అరుణ తార హన్మంత్ షిండే, బీబీ పాటిల్, గంగారాం తదితరులు





వాహన బీమా జీవితానికి ధీమా

మీకోసం



ఖలీల్‌వాడి, న్యూస్‌టుడే (నిజామాబాద్)

వాహనం ఏదైనా సరే. ప్రమాద బీమాతోనే ధీమా ఉంటుంది. దురదృష్టవశాత్తు అనుకోని సంఘటనలు వాటిల్లితే.. ఎదుటి వారికి కూడా ఇన్సూరెన్స్ భరోసా కల్పిస్తుంది. ఒక వేళ ముందు జాగ్రత్త లేకుంటే ప్రమాద బాధిత కుటుంబాలన్నీ రోడ్డున పడాల్సిన దుస్థితి ఎదురవుతుంది. రవాణా శాఖ అంచనా ప్రకారం.. జిల్లాలో బీమా సదుపాయం ఉన్న వాహనాల సంఖ్య 45 శాతం మాత్రమే. ఈ నేపథ్యంలో ప్రతి వాహనదారుడు మేల్కోవాలి. బీమా భరోసాతో కూడిన ప్రయాణాలు కొనసాగించాలి.

వాహనాల సంఖ్య పెరుగుతున్నా...

జిల్లాలో ఏటేటా వాహనాల కొనుగోళ్లు ఎక్కువగా నమోదవుతున్నాయి. కొత్త వాహనాన్ని కొనుగోలు చేసినప్పుడు, లేదా రెన్యూవల్, ఫిట్‌నెస్ పరీక్షల సమయాల్లోనే చాలామంది బీమా చేయిస్తున్నారు. ఆ తర్వాత ప్రతి ఏటా పాలసీని రెన్యువల్ చేసుకోవాల్సి ఉంటుంది. ఈ సందర్భంలోనే ఎక్కువ శాతం మంది నిర్లక్ష్యం చూపుతున్నారు. కొందరు రోడ్డు ప్రమాదాల బారినపడినప్పుడు ఆర్థికంగా కోలుకోలేని విధంగా దెబ్బతింటున్నారు. వైద్య ఖర్చులకు తోడు వాహన నష్టం అపారంగా ఉంటోంది. వాహన సామర్థ్యం ఆధారంగా ఏడాదికి రూ.వెయ్యి నుంచి రూ.25 వేల వరకు ప్రీమియం చెల్లిస్తే ముప్పు నుంచి భద్రత పొందవచ్చు. ముఖ్యంగా థర్డ్ పార్టీ ద్వారా ఎదుటి వ్యక్తికి.. అతడి వాహనానికి సైతం బీమా వర్తిస్తుంది. కాంప్రహెన్సివ్ పాలసీ, థర్డ్ పార్టీ సహా ఓన్ డ్యామేజ్ కింద ప్రీమియం చెల్లిస్తే ఇరుపక్షాలకు భరోసా ఉంటుంది.

ఆన్‌లైన్‌లో మోసాలకు అవకాశం

వాహన బీమా పాలసీల విషయంలోనూ మోసాలు వెలుగుచూస్తున్నాయి. ఆన్‌లైన్‌లో ప్రీమియం చెల్లించే సదుపాయం వచ్చాక మరింత అప్రమత్తంగా వ్యవహరించాల్సి వస్తోంది. కొందరు నకిలీ బీమా పత్రాలతో బురిడీ కొట్టిస్తున్నారు. పాత వాహనాల క్రయవిక్రయాల విషయంలోనూ మరింత జాగ్రత్తగా ఉండాలి. ఆ సమయంలో యాజమాన్య హక్కులు (ఓనర్‌షిప్) తప్పనిసరిగా బదిలీ చేయించుకోవాలి. లేకపోతే వాహనం కొన్న వ్యక్తి ఏదైనా ప్రమాదం చేసినా, నేరానికి పాల్పడినా రికార్డుల ప్రకారం అసలైన యజమానే నష్టాన్ని భరించాల్సి ఉంటుంది.

ఇన్సూరెన్స్ తప్పనిసరి..

ప్రతి వాహనానికి బీమా తప్పనిసరి చేయించాలి. నిర్లక్ష్యంగా వాహనాలను నడిపేవారిపై చట్టం ప్రకారం చర్యలు తప్పవు. వాహనం విక్రయించినప్పుడు ఓనర్‌షిప్‌ను విధిగా బదిలీ చేయించుకోవాలి.

- రమేష్ రాథోడ్, డీటీవో, నిజామాబాద్

ప్రశాంతంగా 'నీట్' పీజీ

నిజామాబాద్ అర్బన్, న్యూస్‌టుడే: జిల్లాలోని అర్సపల్లి, మల్లారంలో ఏర్పాటు చేసిన కేంద్రాల్లో నీట్ (పీజీ) ఆదివారం ప్రశాంతంగా ముగిసింది. మొత్తం 265 మంది అభ్యర్థులకు హాల్‌టికెట్లు జారీ చేశారు. వీరిలో 263 మంది పరీక్ష రాశారు. ఇద్దరు గైర్హాజరయ్యారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా పోలీస్ బందోబస్తును పకడ్బందీగా ఏర్పాటు చేశారు. ఉదయం 9 గంటల పరీక్ష ప్రారంభమైంది.

ఆకట్టుకునేలా డిజిటల్ బోధన


రాష్ట్రంలో పలు ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో బోధన డిజిటల్ తెరపై సాగుతోంది. ఇటీవల ఇంటర్ మొదటి సంవత్సరం సిలబస్ మారింది. దానికి అనుగుణంగా ఎల్లారెడ్డి, గాంధారితోపాటు ఉమ్మడి నిజామాబాద్



జిల్లాలోని 37 ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో ప్రథమ, ద్వితీయ సంవత్సరంలో డిజిటల్ తరగతులు ప్రారంభమయ్యాయి. భగవద్గీత శ్లోకాల నుంచి సైన్స్ పాఠాల వరకు ఇంటరాక్టివ్ ప్యానెల్స్‌తో దృశ్యరూపంలో బోధిస్తున్నారు. 'డిజిటల్ బోధనతో విద్యార్థుల్లో సృజనాత్మకత పెరుగుతోంది. హాజరు శాతం కూడా పెరిగింది' అని గాంధారి జూనియర్ కళాశాల అధ్యాపకులు తెలిపారు.

– న్యూస్‌టుడే, ఎల్లారెడ్డి, గాంధారి









హానికర వ్యర్థాలతో పర్యావరణానికి ముప్పు

ఇక నుంచి శానిటరీ, బయోవ్యర్థాలకు విడిగా డబ్బాలు

న్యూస్‌టుడే, నిజామాబాద్ నగరం

గ్రామ పంచాయతీలతో పాటు పుర, నగరపాలికల్లో సైతం చెత్త సేకరణకు ప్రభుత్వం కొత్త విధానం రూపొందించింది. ఇప్పటిదాకా తడి, పొడి చెత్తను మాత్రమే సేకరిస్తున్నారు. ఇకపై శానిటరీ, హానికర చెత్తను తప్పనిసరిగా విడిగా సేకరించాలని కాలుష్య నియంత్రణ మండలి (పీసీబీ) ఆదేశాల్లో పేర్కొంది. నిజామాబాద్ నగరపాలిక పరిధిలో రోజుకు సుమారు 200 టన్నుల వ్యర్థాలను డంపింగ్‌యార్డుకు తరలిస్తున్నారు. ప్రస్తుతం హానికరమైన శానిటరీ చెత్తను విడిగా సేకరించడం లేదు. వ్యర్థాలను తడి, పొడిచెత్తలో కలిపేస్తుండటంతో పర్యావరణానికి ముప్పు వాటిల్లుతోంది. ఎక్కడ పడితే అక్కడ పడేయడం, కాల్చడం కూడా ప్రమాదకరమని శాస్త్రవేత్తలు హెచ్చరిస్తున్నారు. ఈ నేపథ్యంలో సుప్రీంకోర్టు, నేషనల్ గ్రీన్ ట్రైబ్యునల్(ఎన్‌జీటీ) ఆదేశాలతో శానిటరీ, హానికర చెత్తను వేర్వేరుగా సేకరించాలని పీసీబీ ఉత్తర్వులు జారీ చేసింది. దీని ప్రకారం నగరపాలిక అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు.



చెత్త సేకరణకు ఏర్పాటు చేయనున్న డబ్బాలు..

అనుమతి లేకుండానే నిర్వహణ

నగరం ప్రైవేటు వైద్యానికి హబ్‌గా మారింది. ఇదే సమయంలో కొన్ని ప్రైవేటు ఆసుపత్రుల్లో నిబంధనలను సక్రమంగా పాటించడం లేదు. బయో మెడికల్ వేస్ట్ మేనేజ్‌మెంట్‌కు సంబంధించి వైద్యశాఖ నుంచి ప్రత్యేకంగా ధ్రువపత్రాన్ని పొందాలి. ఆసుపత్రులు ఈ నిబంధనను ఉల్లంఘిస్తున్నాయి. జిల్లా వైద్యశాఖ ఇటీవల చేపట్టిన తనిఖీల్లోనూ ఇదే తేలింది. ఆసుపత్రులపై దృష్టిసారించి నాలుగు డబ్బాల్లో చెత్త సేకరణ జరిగేలా చూడాలి.

నాలుగు రంగుల్లో..: గతంలో నగరంలో నీలం, ఆకుపచ్చ రంగు డబ్బాలు అందించారు. అవి పాడైపోవడంతో కవర్లు, డబ్బాల్లో వ్యర్థాలు పోగేసి చెత్త వాహనాలకు అందిస్తున్నారు. ఇకపై కొత్త విధానంలో నీలం, ఆకుపచ్చతో పాటు ఎరుపు, నలుపు చెత్త బుట్టల్లో వ్యర్థాలను విభజించి అందజేయాలి. కొత్తగా శానిటరీ డబ్బాలో డైపర్లు, శానిటరీ ప్యాడ్లు, న్యాప్కిన్లు, హానికర చెత్త డబ్బాలో మెడికల్ వ్యర్థాలు, పనికిరాని ఎలక్ట్రానిక్ వస్తువులు, పెయింటింగ్ డబ్బాలను వేరుగా పడేయాలి.

నాలుగు రకాల డబ్బాల చెత్త సేకరణపై నగరంలోని అన్ని కుటుంబాలకు అవగాహన కల్పిస్తున్నాం. జిల్లాలోని గ్రామాలతో పాటే నూతన విధానాన్ని పుర, నగరపాలికల్లోనూ పక్కాగా అమలు చేయాల్సి ఉంది. దీనికి సంబంధించి పీసీబీ స్పష్టమైన ఆదేశాలను జారీ చేసింది.

- తిరుపతి, సహాయ పర్యావరణ శాస్త్రవేత్త

'అభివృద్ధి నిధి'.. ఏదీ?

◆ నియోజకవర్గాలకు పైసా విదల్చని ప్రభుత్వం

◆ రెండున్నర ఏళ్లుగా ఎదురుచూపులు..

న్యూస్‌టుడే, ఎల్లారెడ్డి

శాసనసభ నియోజకవర్గాల ప్రగతికి ఉద్దేశించిన నియోజకవర్గ అభివృద్ధి నిధుల(సీడీఎఫ్)పై నీలినీడలు కమ్ముకున్నాయి. రాష్ట్రవ్యాప్తంగా గత రెండున్నర సంవత్సరాలుగా ప్రభుత్వం సీడీఎఫ్ కింద పైసా విదల్చడం లేదు. దీంతో ఉమ్మడి నిజామాబాద్ జిల్లాలోని పలు పట్టణాలు, గ్రామాల్లో అభివృద్ధి కార్యక్రమాలు కుంటుపడ్డాయన్న విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

రూ.5 కోట్లకు పెంచినా..

నియోజకవర్గాల అభివృద్ధి, దీర్ఘకాలంగా ఉన్న సమస్యల పరిష్కారానికి ఎమ్మెల్యేలు సీడీఎఫ్ వినియోగిస్తారు. ప్రధానంగా అసంపూర్తి భవనాలు, అదనపు గదులు, సీసీ రోడ్ల నిర్మాణం, మౌలిక సదుపాయాలు వెచ్చించేందుకు ప్రాధాన్యమిస్తారు. జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి ఆమోదంతో ఈ నిధులు ఖర్చు చేయాల్సి ఉంటుంది. గతంలో ఒక్కో నియోజకవర్గానికి ఏడాదికి రూ.3 కోట్లు చొప్పున విడుదల అవుతుండేవి. 2022-23లో అప్పటి ప్రభుత్వం ఆ మొత్తాన్ని రూ.5 కోట్లకు పెంచింది. అందులోంచి 2023లో రాష్ట్రవ్యాప్తంగా ఒక్కో నియోజకవర్గానికి రూ.2 కోట్ల చొప్పున విడుదల చేయగా.. ఉమ్మడి నిజామాబాద్ జిల్లాలోని 9 నియోజకవర్గాలకు కూడా కేటాయించింది. ఈ నిధులను ఆయా నియోజకవర్గాల్లో మన ఊరు-మన బడి కార్యక్రమం కింద ప్రభుత్వ పాఠశాలల్లో గదుల నిర్మాణం, మరమ్మతులు, మౌలిక సదుపాయాల కల్పనకు వెచ్చించారు. తర్వాత అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం.. మొదటి అసెంబ్లీ బడ్జెట్ సమావేశాల్లో సీడీఎఫ్ విడుదల చేస్తామని ప్రకటించింది. తర్వాత జరిగిన బడ్జెట్ సమావేశాల్లో నియోజకవర్గ అభివృద్ధి నిధులు కేటాయించింది. కానీ, రెండున్నర ఏళ్లుగా ఉమ్మడి జిల్లాలోని ఒక్క నియోజకవర్గానికి కూడా పైసా విడుదల చేయలేదు.

రూ. 90 కోట్లు..

ఉమ్మడి జిల్లాలో 9 నియోజకవర్గాలు ఉండగా ఒక్కో నియోజకవర్గానికి రూ.5 కోట్ల చొప్పున రెండేళ్లకు సంబంధించి సుమారు రూ. 90 కోట్ల సీడీఎఫ్ రావాల్సి ఉంది. ఆ నిధులు రాకపోవడంతో ఉమ్మడి జిల్లాలోని పలు గ్రామాలు, పట్టణాల్లో అభివృద్ధి పనులు నిలిచిపోయి ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఈ విషయాన్ని ఎమ్మెల్యేలు పలుమార్లు ప్రభుత్వం దృష్టికి కూడా తీసుకెళ్లారు. అయినా ఫలితం కనిపించకపోగా.. ప్రజలకు ఇచ్చిన హామీలు నెరవేర్చలేకపోతున్నామని ఎమ్మెల్యేలు సతమతమవుతున్నారు. అధికార పార్టీ ఎమ్మెల్యేలు ఇన్‌ఛార్జి మంత్రుల ద్వారా ఎంతోకొంత ఇతర నిధులు పొందుతూ అభివృద్ధి కార్యక్రమాలు చేపడుతున్నారు. ప్రతిపక్ష ఎమ్మెల్యేలు ఉన్న నియోజకవర్గాలు ఆ నిధులకు కూడా నోచుకోవడం లేదు. ఇటు సీడీఎఫ్ నిధులు రాక.. మంత్రులు నిధులు కేటాయించక తమ నియోజకవర్గాల్లో అభివృద్ధి మందగిస్తోందని ప్రతిపక్ష ఎమ్మెల్యేలు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం నియోజకవర్గాల అభివృద్ధి నిధులను సత్వరం మంజూరు చేయాలని కోరుతున్నారు.



ఎల్లారెడ్డిలో నిధులు లేక అసంపూర్తిగా నిలిచిపోయిన వ్యవసాయ శాఖ కార్యాలయ భవనం

పల్లె క్రీడాకారులు.. కుస్తీలో మెరికలు..

న్యూస్‌టుడే, మోపాల్

మంచిప్ప గ్రామానికి చెందిన ముగ్గురు విద్యార్థులు రెజ్లింగ్‌లో ప్రతిభ కనబర్చి ఇటీవల తెలంగాణ ప్రాంతీయ స్పోర్ట్స్ రెజ్లింగ్ అకాడమీకి ఎంపికయ్యారు. పండుగలు, ప్రత్యేక సందర్భాల్లో గ్రామీణ ప్రాంతాల్లో నిర్వహించిన కుస్తీ పోటీల్లో మల్లయోధులు తలపడే విన్యాసాలు చూసిన విద్యార్థులు ఈ ఆటపై ఆసక్తిని పెంచుకున్నారు. మంచిప్ప జడ్పీహెచ్ఎస్ పీఈటీ దేవేందర్ వద్ద శిక్షణ పొంది మెలకువలు నేర్చుకున్నారు. మండల, జిల్లా, రాష్ట్ర స్థాయి రెజ్లింగ్ పోటీల్లో సత్తాచాటి అకాడమీకి ఎంపికైన తొలి విద్యార్థులుగా స్ఫూర్తిగా నిలిచారు.

జిల్లాకు పేరు తేవడమే నా లక్ష్యం

- ప్రవీణ్, రమేశ్‌పూర్‌తండా



గత మూడేళ్లుగా నేను మంచిప్ప జడ్పీహెచ్ఎస్‌లో కుస్తీలో శిక్షణ తీసుకున్నా. మూడుసార్లు రాష్ట్రస్థాయి పోటీల్లో ప్రాతినిధ్యం వహించా. రంగారెడ్డిలో జరిగిన అండర్-17 రాష్ట్రస్థాయి పోటీల్లో వెండి పతకం సాధించా. గతేడాది సీఎం కప్ రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొన్నా. అండర్-17 ఎస్‌జీఎఫ్ రాష్ట్రస్థాయి పోటీల్లో తలపడి రజతం సాధించా. జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో రాణించి జిల్లాకు మంచిపేరు తేవడమే నా లక్ష్యం.

ప్రత్యక్షంగా చూసి నేర్చుకున్నా..

- బి.శ్రీకాంత్, మంచిప్ప



గ్రామంలో కుస్తీ క్రీడాకారులు పోటీపడడం ప్రత్యక్షంగా చూసి ఈ ఆట నేర్చుకోవాలని కోరిక కలిగింది. జడ్పీహెచ్ఎస్‌లో మూడేళ్లుగా శిక్షణ పొందా. రెండుసార్లు రాష్ట్రస్థాయి పోటీల్లో నిజామాబాద్ జిల్లా తరఫున తలపడి పతకాలు సాధించా. రెజ్లింగ్ అకాడమీకి ఎంపికైనందుకు సంతోషంగా ఉంది. మెరుగైన శిక్షణతో మెలకువలు నేర్చుకుంటా. ఒలింపిక్స్‌లో పాల్గొనడం నా కల.

లక్ష్యం నిర్దేశించుకున్నా..

- బి.మహేందర్, మంచిప్ప




మంచిప్ప జడ్పీహెచ్ఎస్‌లో నా సీనియర్ క్రీడాకారులను చూసి రెజ్లింగ్‌పై ఆసక్తి పెరిగింది. వారు సాధించిన పతకాలను చూసి ఆకర్షితుడినై పీఈటీ వద్ద శిక్షణ పొందా. ప్రస్తుతం ప్రాంతీయ అకాడమీకి ఎంపికకావడం జరిగింది. రాష్ట్ర, జాతీయ స్థాయుల్లో పాల్గొని బంగారు పతకాలు సాధించడమే నా లక్ష్యంగా నిర్దేశించుకున్నా.

పాంచజన్య సంకల్ప సభ విజయవంతానికి ఏర్పాట్లు

ర్యాలీ అనంతరం ప్రసంగించనున్న కల్వకుంట్ల కవిత

నిజామాబాద్ అర్బన్, న్యూస్‌టుడే: తెలంగాణ రక్షణ సేన ఆధ్వర్యంలో నిజామాబాద్‌లో సోమవారం జరగనున్న పాంచజన్య సంకల్ప సభకు పార్టీ నేతలు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు. నగరంలోని పాత కలెక్టరేట్ మైదానంలో మధ్యాహ్నం 3.40 గంటలకు సభ మొదలుకానుంది. నిజామాబాద్, కామారెడ్డి, జగిత్యాల జిల్లాల నుంచి కార్యకర్తలను తరలించేందుకు నాయకులు ఏర్పాట్లు చేశారు. పార్టీ వ్యవస్థాపక అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత సభకు హాజరై ప్రసంగించనున్నారు. ఆమె హైదరాబాద్ నుంచి బయల్దేరి మధ్యాహ్నం 2.30 గంటలకు ఇందల్‌వాయికి చేరుకుంటారు. గన్నారం చౌరస్తాలో పార్టీ జెండాను ఆవిష్కరిస్తారు. అనంతరం నిజామాబాద్ శివారులోని మాధవనగర్ సాయిబాబా ఆలయం నుంచి 2.45 గంటలకు ర్యాలీగా సభా ప్రాంగణానికి బయల్దేరతారు. సాయంత్రం 6.30 గంటలకు నందిపేట మండలం సీహెచ్ కొండూరులోని రాజ్యలక్ష్మి సమేత లక్ష్మీనరసింహ స్వామిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేస్తారు.



సభ నిర్వహించనున్న పాత కలెక్టరేట్ మైదానంలో తెలంగాణ రక్షణ సేన జెండాలు

గ్రామాల అభివృద్ధే ప్రభుత్వ ధ్యేయం : డా.భూపతిరెడ్డి

నిజామాబాద్ గ్రామీణం, న్యూస్‌టుడే: గ్రామాల అభివృద్ధే తమ ప్రభుత్వ ధ్యేయమని గ్రామీణ నియోజకవర్గ ఎమ్మెల్యే డా.భూపతిరెడ్డి పేర్కొన్నారు. ఆదివారం రూరల్ క్యాంపు కార్యాలయంలో నియోజకవర్గంలోని జక్రాన్‌పల్లి, నిజామాబాద్ గ్రామీణం, మోపాల్, ధర్పల్లి, ఇందల్‌వాయి మండలాల్లో పలు అభివృద్ధి పనులకు సంబంధించిన రూ.99.60 లక్షల మంజూరు పత్రాలను ఆయా గ్రామాల ప్రజాప్రతినిధులకు అందజేసి మాట్లాడారు. సామాజిక సంఘ భవనాలు, ఆలయాలు, తండాలు, గ్రామాల్లో మౌలిక వసతుల కల్పనకు నిధులు మంజూరు చేసినట్లు తెలిపారు. ప్రజలకు ఇచ్చిన హామీలను ఒక్కొక్కటిగా అమలు చేస్తూ నియోజకవర్గాన్ని అన్ని రంగాల్లో ముందుంచుతామని చెప్పారు. ఈ సందర్భంగా పలువురు నాయకులు ఎమ్మెల్యేను సన్మానించారు. గ్రామాల సర్పంచులు, ప్రజాప్రతినిధులు, సొసైటీ ఛైర్మన్లు, ఉప సర్పంచులు తదితరులు పాల్గొన్నారు.



మంజూరు పత్రం అందజేస్తున్న ఎమ్మెల్యే డా.భూపతిరెడ్డి

మారథాన్‌లో కామారెడ్డి కౌన్సిలర్‌కు పతకం

కామారెడ్డి క్రీడావిభాగం, న్యూస్‌టుడే: హైదరాబాద్‌లో ఎన్ఎండీసీ ఆధ్వర్యంలో ఆదివారం ఉదయం నిర్వహించిన మారథాన్‌లో కామారెడ్డి మున్సిపాలిటీ కౌన్సిలర్ గెరిగంటి లక్ష్మీనారాయణ పతకం అందుకున్నారు. నెక్లెస్‌రోడ్డు నుంచి గచ్చిబౌలి స్టేడియం వరకు గల 42 కిలోమీటర్ల దూరాన్ని లక్ష్మీనారాయణ 3.54 గంటల్లో ఆగకుండా పూర్తి చేశారు. ఈ టోర్నీ కోసం ఆయన మూడు నెలలుగా శ్రమించారు. నిత్యం 5 కి.మీ దూరం పరుగు సాధన చేశారు.



పతకం చూపుతున్న లక్ష్మీనారాయణ

సాంస్కృతిక విభాగ కో-కన్వీనర్‌గా ప్రీతిజైన్



కామారెడ్డి పట్టణం, న్యూస్‌టుడే: కామారెడ్డి జిల్లాకేంద్రానికి చెందిన 44వ వార్డు కౌన్సిలర్ ప్రీతిజైన్ ఆదివారం భాజపా రాష్ట్ర సాంస్కృతిక విభాగ కో-కన్వీనర్‌గా నియమితులయ్యారు. ఈ మేరకు రాష్ట్ర శాఖ నియామక పత్రాన్ని తాజాగా ఆమెకు అందజేసింది. తనపై నమ్మకం ఉంచి పదవి దక్కేందుకు కృషి చేసిన కామారెడ్డి ఎమ్మెల్యే వెంకటరమణారెడ్డి, భాజపా జిల్లా అధ్యక్షుడు నీలం చిన్నరాజులుకు ఆమె కృతజ్ఞతలు తెలిపారు.

ఉమ్మడి నిజామాబాద్ జిల్లా స్థాయి ఆర్చరీ పోటీలు

దోమకొండ, న్యూస్‌టుడే: దోమకొండలోని గడీ కోట మైదానంలో ఉమ్మడి నిజామాబాద్ జిల్లా స్థాయి ఆర్చరీ పోటీలు(జూనియర్ విభాగంలో) ఆదివారం నిర్వహించారు. ఆర్చరీ జిల్లా అసోసియేషన్ అధ్యక్షుడు తీగల తిర్మల్‌గౌడ్ పోటీలను ప్రారంభించారు. కామారెడ్డి, నిజామాబాద్ జిల్లాలకు చెందిన 50 మంది క్రీడాకారులు పాల్గొన్నారు. ఇండియన్ రౌండ్ విభాగంలో.. బాలికలు(జె.లైలా, కె.ప్రీతి, కె.అంజలి, ఎ.శ్రావ్య, జె.శ్రీజ, ఎన్.భావన), బాలురు (జి.ప్రణీత్, ఎస్.కె.రేహాన్, రామ్‌చరణ్, ఇ.అరవింద్, ఎస్.డి.సోఫియన్, ఎస్.స్నేహిత్), రికర్వు రౌండ్ విభాగంలో.. బాలికలు(బి.ఇందు, బి.వైష్ణవి, ఎన్.వర్షిత), బాలురు (ఎం.అనుదీప్, ఎ.నవీన్, డి.అకుల్, ఎన్.రుత్విక్, డి.హేమంత్, ఎస్.నిశిత్‌కుమార్), కాంపౌండ్ రౌండ్ విభాగంలో బి.సురేష్‌చౌదరి ప్రతిభ కనబరిచి రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికయ్యారు. వారిని జిల్లా అసోసియేషన్ ప్రతినిధులు అభినందించారు. కార్యక్రమంలో శిక్షకుడు ప్రతాప్‌దాస్, అసోసియేషన్ ప్రతినిధులు నర్సింహారెడ్డి, మోహన్‌రెడ్డి, రాంచంద్రం పాల్గొన్నారు.



రాష్ట్రస్థాయికి ఎంపికైన క్రీడాకారులతో సంఘం జిల్లా అధ్యక్షుడు తిర్మల్‌గౌడ్

1న జిల్లాస్థాయి యోగా పోటీలు

నిజామాబాద్ క్రీడావిభాగం, న్యూస్‌టుడే: నిజామాబాద్ యోగా సంఘం ఆధ్వర్యంలో సెప్టెంబరు 1వ తేదీన నందిపేట్‌లోని ఉజ్వల ఉన్నత పాఠశాలలో జిల్లాస్థాయి యోగా పోటీలు నిర్వహించనున్నామని ఆ సంఘం అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఐశ్వర్య, గంగాధర్ ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. ప్రతిభ కనబర్చిన వారిని వచ్చేనెల 12, 13 తేదీల్లో నిర్వహించే రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపిక చేస్తామన్నారు. పోటీల్లో పాల్గొనేవారు ఆన్‌లైన్ రిజిస్ట్రేషన్ చేసుకోవాలని.. వివరాలకు చరవాణి నంబర్ 80749 82200లో సంప్రదించాలని సూచించారు.

ఉత్తర్వుల ఉపసంహరణకు డిమాండ్

నిజామాబాద్ విద్యావిభాగం, న్యూస్‌టుడే: ప్రభుత్వం 1-9తరగతుల సమ్మేటివ్ పరీక్షల జవాబు పత్రాలను మండల వనరుల కేంద్రంలో బాహ్య మూల్యాంకనం చేయించాలని ఇచ్చిన ఉత్తర్వులు తక్షణమే ఉపసంహరించుకోవాలని తపస్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు కిషన్‌రెడ్డి, మధుసూదనాచారి ఆదివారం ఓ ప్రకటనలో డిమాండ్ చేశారు. ఇప్పటికే పాఠశాలల్లో బోధనేతర పనులతో విద్యార్థులు నష్టపోతున్నారని, బాహ్య మూల్యాంకనం మరింత ప్రతికూల ప్రభావం చూపుతుందని ఆందోళన వ్యక్తం చేశారు.

ప్రజా సమస్యలు పరిష్కరించాలి

ఖలీల్‌వాడి, న్యూస్‌టుడే: ప్రజా సమస్యలు పరిష్కరించడానికి ప్రజాప్రతినిధులు కృషి చేయాలని నిజామాబాద్ నగర అభివృద్ధి కమిటీ అధ్యక్షుడు యాదగిరి పేర్కొన్నారు. ఆదివారం సుభాష్‌నగర్‌లోని తెలంగాణ ఆల్ పెన్షనర్స్ భవనంలో సమావేశం నిర్వహించారు. మాస్టర్ ప్లాన్‌లో లోపాలు, అభ్యంతరాలు, మార్పులు పరిశీలించిన తర్వాత ప్లాన్ అమలు చేయాలన్నారు. బస్టాండ్ వద్ద రోడ్డు మరమ్మతులు చేపట్టి మౌలిక వసతులు కల్పించాలన్నారు. కమిటీ ప్రధానకార్యదర్శి రామ్మోహన్‌రావు తదితరులున్నారు.



మాట్లాడుతున్న నగర అభివృద్ధి కమిటీ అధ్యక్షుడు యాదగిరి

పురావస్తు ప్రదర్శనశాల.. పునర్ వైభవం కలేనా?

న్యూస్‌టుడే, నిజామాబాద్ సాంస్కృతికం

నాలుగేళ్లుగా వేసిన తాళం వేసినట్టే ఉన్న వైనం

అది.. అపురూప శిల్పాలు, శిలాశాసనాలు, తాళపత్ర గ్రంథాలు, అరుదైన వస్తువులు నెలవైన పురావస్తు ప్రదర్శనశాల. రూ.లక్షలు వెచ్చించి కొన్నేళ్ల కిందట పునరుద్ధరణ పనులు పూర్తిచేశారు. కానీ, తగినంత మంది సిబ్బందితో పాటు అల్మారాలు లేవని గేటుకు తాళం వేశారు. జిల్లా కేంద్రంలో తిలక్‌గార్డెన్ ప్రాంగణంలోనున్న పురావస్తు ప్రదర్శనశాల కళతప్పిపోతోంది.



ప్రదర్శనశాలలో పిచ్చిమొక్కల మధ్య అరుదైన శిల్పాలు ఇలా..

గతమెంతో ఘనం..

ఇందూరు ఉత్సవాల్లో భాగంగా 2001లో అప్పటి కలెక్టర్ అశోక్‌కుమార్ చొరవతో తిలక్‌గార్డెన్ టౌన్‌హాల్‌లో పురావస్తు ప్రదర్శనశాలను ఏర్పాటు చేశారు. జిల్లాలోని వివిధ ప్రాంతాల్లో ఉన్న అరుదైన శిల్పాలు, శిలాశాసనాలు, విశేష ప్రాచుర్యం గల తాళపత్ర గ్రంథాలు, నాణేలను సేకరించి ప్రదర్శనకు ఉంచారు. వారంలో ఒకరోజు ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులు ఉచితంగా సందర్శించే అవకాశం కల్పించారు. భవనం పాతది కావడంతో వర్షాలకు గోడలు కురిశాయి. అరుదైన గ్రంథాలు, ఆభరణాలు తడిసి దెబ్బతినే పరిస్థితి ఎదురైంది. ఈ కారణంగా 2012-2014 మధ్య ప్రదర్శనశాలను మూసి ఉంచారు. ఆ తర్వాత నాలుగేళ్ల కిందట రూ.40 లక్షలతో భవనాన్ని పునరుద్ధరించారు. కానీ, సిబ్బంది కొరత, అల్మారాల్లేవంటూ అప్పటి నుంచి ఆ మ్యూజియం తాళాలు తీయడం లేదు. మరోవైపు ఆకతాయిలు గోడలపై రాతలు గీస్తూ సున్నం, రంగులను చెరిపేస్తున్నారు.



గోడలపై ఆకతాయిలు గీసిన రాతలు

చూస్తున్నారు.. వెళ్తున్నారు..

ప్రదర్శనశాల పునరుద్ధరణ ఆవశ్యకతపై 'ఈనాడు'లో వరుసగా కథనాలు ప్రచురితం అయ్యాయి. రాష్ట్ర పురావస్తు పరిశోధన శాఖ సంచాలకుడు ఆచార్య అర్జున్‌రావు, ఏడీ సాగర్ తదితరులు స్పందించి ఏప్రిల్ 4వ తేదీన మ్యూజియాన్ని స్వయంగా పరిశీలించారు. సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ప్రదర్శనశాలను వీలైనంత త్వరగా అందుబాటులోకి తీసుకువస్తామని చెప్పి వెళ్లారు. ఆ తర్వాతా పరిస్థితిలో ఎలాంటి మార్పులేదు. మరో రూ.4 లక్షలతో పది అల్మారాలు ఏర్పాటుచేసి, కొందరు నిర్వహణ సిబ్బందిని నియమిస్తే ప్రదర్శనశాలకు పూర్వ వైభవం వస్తుందని చరిత్ర పరిశోధకులు చెబుతున్నారు. జిల్లా కలెక్టర్ అయినా స్పందించి మ్యూజియంను పునఃప్రారంభించాలని విద్యార్థులు, తల్లిదండ్రులు కోరుతున్నారు.

కోటీశ్వరులు అంటారు.. టోపీ పెడతారు!

☛ అత్యాశకు పోతే ఖాతా ఖాళీ

☛ యాప్స్‌తో జాగ్రత్త

న్యూస్‌టుడే, ఎల్లారెడ్డి, సదాశివనగర్

ఆన్‌లైన్ డేటింగ్, నకిలీ ట్రేడింగ్ యాప్‌లు, బోగస్ ప్రకటనలు ప్రజలను ఆర్థికంగా నష్టాలకు గురిచేస్తున్నాయి. నకిలీవా, అసలువా అని తెలుసుకోకుండా యాప్‌లను కొందరు చరవాణుల్లో డౌన్‌లోడ్ చేసుకుంటూ కష్టాలను కొని తెచ్చుకుంటున్నారు. తక్కువ సమయంలో అధిక మొత్తంలో సంపాదించొచ్చు అన్న ఆశతో కొందరు నకిలీ ట్రేడింగ్ యాప్‌లు డౌన్‌లోడ్ చేసుకుంటూ సైబర్ నేరస్థుల ఉచ్చులో చిక్కుకుంటున్నారు. మరికొందరు యువకులు.. యువతులు, మహిళలతో పరిచయాలు పెంచుకోవాలన్న మోజులో సర్వస్వం కోల్పోతున్నారు.

వల విసిరి.. ముఖం చాటేసి

నగరాల మాదిరిగా మండలాలు, గ్రామాలకు సైతం ఆన్‌లైన్ డేటింగ్ సంస్కృతి విస్తరిస్తోంది. కొందరు యువకులు.. మహిళలు, యువతులతో సులభంగా పరిచయాలు పెంచుకునేందుకు డేటింగ్ యాప్‌లను డౌన్‌లోడ్ చేసుకుంటున్నారు. ఆన్‌లైన్ వేదికగా స్నేహితులు, ప్రేమికులను, కాబోయే జీవిత భాగస్వాములను వెతుక్కుంటున్నారు. యువకుల్లో పెరుగుతున్న ఈ ధోరణి పెను ప్రమాదానికి దారితీస్తోంది. కొన్ని యాప్‌లు నకిలీ ప్రొఫైల్ ఫొటోలు, వివరాలు అడ్డుగా పెట్టుకుని యువతను ఆకర్షిస్తున్నాయి. మహిళలు, యువతులతో మాట్లాడటానికి, చనువుగా ఉండటానికి, ఏకాంతంగా గడపడానికి అంటూ యువకులకు వల విసురుతూ ఆన్‌లైన్‌లో అడ్డగోలుగా డబ్బులు ట్రాన్స్‌ఫర్ చేయించుకుంటున్నారు. అనంతరం ఫోన్లకు స్పందించకుండా ముఖం చాటేస్తున్నారు. డబ్బులు కోల్పోయిన తర్వాత గానీ తాము మోసపోయామని యువకులు గుర్తించడం లేదు. తేరుకునేలోపే జరగాల్సిన నష్టం జరిగిపోతోంది. ఎల్లారెడ్డి నియోజకవర్గం సదాశివనగర్ మండలానికి చెందిన ఓ యువకుడు ఇలాగే మోసపోయాడు.

ట్రేడింగ్.. ఫ్రాంచైజీల పేరుతో..

షేర్ మార్కెట్‌లో డబ్బులు పెడితే రాత్రికి రాత్రే కోటీశ్వరులు అవుతారని సైబర్ నేరస్థులు అమాయకులను బురిడీ కొట్టిస్తున్నారు. టెలిగ్రాం గ్రూపుల్లో చేరండి, పెట్టుబడి పెడితే రెట్టింపు లాభం వస్తుందంటూ చేర్చుకుంటున్నారు. యాప్‌లను డౌన్‌లోడ్ చేయించుకుంటున్నారు. లాభాలు వచ్చినట్లు తెరపై చూపిస్తున్నారు. ఆ డబ్బు తీసుకోవాలంటే పన్నుల పేరుతో మరింత దండుకుంటున్నారు. డబ్బులు వస్తాయన్న ధీమాతో ఉన్న వారి ఖాతాలు ఖాళీ చేసి కుచ్చుటోపీ పెడుతున్నారు. యాప్, టెలిగ్రాంలో ఇచ్చిన నంబర్లు పనిచేయకపోవడంతో మోసపోయామని గ్రహిస్తున్నారు.

అప్రమత్తతతోనే మేలు..

సైబర్ నేరస్థులు ఎప్పటికప్పుడు సరికొత్త సాంకేతికతను వాడుకుంటూ రకరకాల యాప్‌లు, టెలిగ్రాం ఛానళ్లను రూపొందిస్తున్నారు. వాటిని నమ్మి అపరిచితులకు డబ్బులు పంపితే మోసపోవడం ఖాయమని నిపుణులు, పోలీసులు స్పష్టం చేస్తున్నారు. అప్రమత్తతతోనే ఇలాంటి యాప్‌లు, టెలిగ్రాంల బారి నుంచి తప్పించుకోవచ్చని చెబుతున్నారు.

మూడు ద్విచక్ర వాహనాలు ఢీ..

ఒకరి మృతి, ముగ్గురికి గాయాలు



డిచ్‌పల్లి : రోడ్డుపై ఉన్న గుంతను తప్పించడానికి ఒకరు ఆకస్మికంగా ద్విచక్రవాహనం బ్రేక్ వేసి పక్కకు రావడంతో ఒకేసారి మూడు ద్విచక్ర వాహనాలు ప్రమాదం బారిన పడ్డాయి. ఈ ఘటనలో మెంట్రాజ్‌పల్లికి చెందిన **గుర్రపు కిషన్**(46) అక్కడికక్కడే మృతిచెందినట్లు డిచ్‌పల్లి ఎస్సై ఆరిఫ్ తెలిపారు. ఎస్సై తెలిపిన వివరాల ప్రకారం.. మెంట్రాజ్‌పల్లికి చెందిన కిషన్ పని నిమిత్తం సుద్దులం వెళ్లి తిరిగి వస్తుండగా.. యానంపల్లికి చెందిన నవీన్ ద్విచక్ర వాహనంపై అటువైపే వెళ్తున్నారు. సుద్దపల్లి గురుకులం సమీపంలో రోడ్డుపై ఉన్న గుంతను తప్పించడానికి నవీన్ ఆకస్మికంగా బ్రేక్ వేసి కిషన్‌కు అడ్డురావడంతో రెండు ద్విచక్ర వాహనాలు ఢీకొన్నాయి. అదే సమయంలో నిజామాబాద్ నుంచి రామడుగువైపు కుటుంబ సభ్యులకు వెళ్తున్న ప్రదీప్ ద్విచక్రవాహనానికి వీరు తగలడంతో వారు సైతం ప్రమాదానికి గురయ్యారు. ఈ ఘటనలో కిందపడిన కిషన్ తీవ్రంగా గాయపడి అక్కడికక్కడే మృతిచెందగా.. ముగ్గురు గాయాలపాలయ్యారు. దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పేర్కొన్నారు.

కారు దగ్ధం.. తప్పిన ప్రమాదం

చేగుంట, న్యూస్‌టుడే: కారులో ఒక్కసారిగా మంటలు ఎగసిపడగా.. త్రుటిలో ప్రమాదం తప్పిన ఘటన మెదక్ జిల్లా చేగుంట సమీపంలోని 44వ జాతీయ రహదారి బైపాస్‌లో ఆదివారం చోటుచేసుకుంది. భిక్కనూరుకు చెందిన మనోజ్, మీనాక్షితో పాటు మరొకరు కారులో హైదరాబాద్‌కు బయలుదేరారు. చేగుంట బైపాస్ సర్కిల్ వంతెనపైకి రాగానే పొగలు వచ్చాయి. వంతెన దిగిన తర్వాత కారును పక్కకు ఆపారు. అందులో ప్రయాణిస్తున్న వారు కిందకు దిగి.. ఇంజిన్ భాగాన్ని పరిశీలిస్తుండగానే మంటలు పెద్ద ఎత్తున వ్యాపించాయి. గ్యాస్‌తో నడిచే కారు కావడంతో షార్ట్‌సర్క్యూట్ అయి మంటలు చెలరేగి ఉంటాయని పోలీసులు భావిస్తున్నారు. రామాయంపేట నుంచి అగ్నిమాపక శకటం వచ్చి మంటలను ఆర్పివేసింది. అప్పటికే కారు పూర్తిగా దగ్ధమైంది.



పొలం బురదలో పడి రైతు మృతి

నిజామాబాద్ గ్రామీణం, న్యూస్‌టుడే: ప్రమాదవశాత్తు పంట పొలంలోని బురదలో పడి రైతు మృతి చెందిన ఘటన గ్రామీణ మండలం డివిజన్-3 గూపన్‌పల్లి గ్రామంలో చోటుచేసుకుంది. రూరల్ ఠాణా ఎస్‌హెచ్‌వో శ్రీనివాస్ తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన భోగ రాజు(40) ఆదివారం తన వ్యవసాయ పొలంలో పురుగుల మందు పిచికారీ చేయడానికి వెళ్లారు. పని ముగించుకొని ద్విచక్ర వాహనంపై తిరిగి ఇంటికి బయల్దేరారు. ఈ క్రమంలో మట్టి రోడ్డుపై వాహనం అదుపుతప్పి ప్రమాదవశాత్తు పక్కన ఉన్న పంట పొలంలోని బురదలో పడ్డారు. రాజు ముఖం బురదలో కూరుకుపోవడంతో ఊపిరాడక అక్కడికక్కడే మృతి చెందినట్లు ఎస్‌హెచ్‌వో తెలిపారు. ఆయన తల్లి సరస్వతి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌హెచ్‌వో తెలిపారు. రాజుకు భార్య, ఇద్దరు కుమారులు ఉన్నారు.

ఇంట్లో కారం చల్లి.. బీరువా పగులగొట్టి..

30 తులాల బంగారం చోరీ..

మాక్లూర్, న్యూస్‌టుడే: కొత్తపల్లిలో ఆదివారం తెల్లవారుజామున భారీ చోరీ జరిగింది. పోలీసుల కథనం ప్రకారం.. వేములపల్లి శ్రీనివాస్‌రావు తన కుటుంబ సభ్యులతో కలిసి నాలుగు రోజుల కిందట హైదరాబాద్ వెళ్లారు. ఇది గమనించిన గుర్తుతెలియని వ్యక్తులు తాళం పగులగొట్టి ఇంట్లోకి చొరబడ్డారు. తమ ఆనవాళ్లు తెలియకుండా ఉండేందుకు గదుల్లో కారం చల్లారు. తర్వాత బీరువాలోని 30 తులాల బంగారం, 300 గ్రాముల వెండిని తీసుకొని పారిపోయారు. స్థానికులు అందించిన సమాచారం మేరకు బాధితుడు హైదరాబాద్ నుంచి సొంతూరుకు చేరుకున్నారు. వారి ఫిర్యాదు మేరకు ఎస్సై అనిల్‌రెడ్డి ఘటనా స్థలానికి చేరుకొని దొంగతనం జరిగిన తీరును పరిశీలించారు. క్లూస్‌టీం, పోలీస్ డాగ్స్‌ను రప్పించారు. ఎలాంటి ఆధారాలు లభించలేదు. పెద్ద మొత్తంలో చోరీ జరగడం స్థానికంగా కలకలం రేపింది. కేసు దర్యాప్తు చేస్తున్నామని, దొంగలను త్వరలో పట్టుకుంటామని ఎస్సై పేర్కొన్నారు.



చిందర వందరగా పారేసిన వస్తువులు

నిజామాబాద్

• నిజామాబాద్ అర్బన్ • నిజామాబాద్ రూరల్ • బోధన్ • బాన్సువాడ

వ్యవసాయ క్షేత్రం సందర్శన

నిజామాబాద్ వ్యవసాయం, న్యూస్‌టుడే: ఏపీలోని ఎన్టీఆర్ జిల్లా చల్లపల్లి మండలం రాముడుపాలెం గ్రామానికి చెందిన రైతులు నిజామాబాద్ జిల్లా కేంద్రానికి చెందిన రైతు చిన్ని కృష్ణుడు వ్యవసాయ క్షేత్రాన్ని ఆదివారం సందర్శించారు. సేంద్రియ పద్ధతిలో పండించే విధానాన్ని తెలుసుకున్నారు. ఆయన ఉపయోగించే వరి వంగడాలు, సాగు విధానాన్ని వివరించారు. ఈ సూచనలు, సలహాలతో తమ ప్రాంతంలో అధిక దిగుబడులు సాధించేలా కృషి చేస్తామని ఏపీ రైతులు తెలిపారు. పర్యటన ద్వారా పలు నూతన విషయాలు తెలుసుకున్నట్లు చెప్పారు. చిన్ని కృష్ణుడు పలువురు రైతులకు ఆదర్శంగా నిలుస్తున్నట్లు కొనియాడారు.

పర్యావరణ పరిరక్షణే ధ్యేయం

నిజామాబాద్ సాంస్కృతికం, న్యూస్‌టుడే: ఇందూరు యజ్ఞ సమితి వ్యవస్థాపకుడు నాగభూషణం గుప్తా ఆధ్వర్యంలో ఆదివారం నగరంలోని నాందేవ్‌వాడలో గాయత్రీ యజ్ఞాన్ని నిర్వహించారు. పర్యావరణ పరిరక్షణ కోసమే యజ్ఞం నిర్వహించినట్లు ఆయన పేర్కొన్నారు. సకాలంలో వర్షాలు కురిసేందుకు , వాతావరణ కాలుష్య నియంత్రణకు ఈ యజ్ఞం దోహదపడుతుందని నిర్వాహకులు తెలిపారు. ప్రతి ఒక్కరు సంస్కృతి సంప్రదాయాలను కాపాడాలని భావితరాలకు వీటిని అందించాలని కోరారు. బండు పాటిల్, మంజుల, రాజశంకర్, ఈశ్వరచరణ్, నాగేశ్వరరావు, మోహన్ తదితరులున్నారు.

మేమున్నాం.. మీకు తోడుగా..

నిజామాబాద్ 94408 85670
బోధన్ 94949 61502
మోపాల్ 94921 61451
నిజామాబాద్ గ్రామీణం 97007 47516

సమస్య: నగరంలో రైల్వే గేట్ సమీపంలోని గోశాల వద్ద కుక్కలు గుంపులుగా తిరుగుతూ దాడి చేస్తున్నాయి.
-రామకృష్ణ, స్థానికుడు

సమాధానం: కుక్కలు పట్టే బృందాలను పంపి వాటిని పట్టుకునే ఏర్పాటు చేస్తాం.
-సోలోమాన్, పారిశుద్ధ్య పర్యవేక్షకుడు

సమస్య: నగరంలోని బ్రిలియంట్ స్కూల్ ఎదుట కుక్కలు వాహనాల వెంట పడుతూ గాయపరుస్తున్నాయి. స్థానికులు సైతం ఇబ్బంది పడుతున్నారు. **-గంగాధర్, స్థానికుడు**

సమాధానం: కుక్కలను పట్టుకునే ఏర్పాట్లు చేస్తాం.
-సోలోమాన్, పారిశుద్ధ్య పర్యవేక్షకుడు

సమస్య: ఆరో డివిజన్ భవానీనగర్‌లోని అనుబంధ కాలనీల్లో ఖాళీ స్థలాల్లో పిచ్చి మొక్కలతో దోమలు పెరిగాయి.
- రవికుమార్, పాఠకుడు

సమాధానం: ఖాళీ స్థలాల యజమానులతో మాట్లాడి పిచ్చి మొక్కలను తొలగింపజేస్తాం. **- సునీల్, పారిశుద్ధ్య పర్యవేక్షకుడు**

న్యూస్‌టుడే: నిజామాబాద్ నగరం, (భవానీనగర్)సుభాష్‌నగర్

అవస్థల చదువులు

రేకుల గదుల్లో తరగతుల బోధన



బోధన్ పురపాలిక, న్యూస్‌టుడే: బోధన్ పట్టణంలోని శక్కర్‌నగర్ బాలికల ఉన్నత పాఠశాలలో 225మంది విద్యార్థినులు చదువుకుంటున్నారు. పాఠశాలలో పదో తరగతి విద్యార్థినులకు మినహా మిగతా తరగతులన్నీ రేకుల గదుల్లోనే కొనసాగుతున్నాయి. ఏళ్ల తరబడి సరైన తరగతి గదులు లేకపోవడంతో విద్యార్థినులు ఇబ్బందులు పడుతున్నారు. రేకుల గదుల్లో కొన్ని వర్షం కురిసినప్పుడు ఊరుస్తున్నాయి. గదుల్లోకి నీరు చేరకుండా పట్టాలు కప్పాల్సిన పరిస్థితి నెలకొంది. వర్షాకాలంలో విద్యార్థినులు, ఉపాధ్యాయులు తీవ్ర అసౌకర్యానికి గురవుతున్నారు. పాత రేకుల గదుల స్థానంలో పక్కా భవనం నిర్మించాలని తల్లిదండ్రులు కోరుతున్నారు.

మరుగుదొడ్ల నిర్మాణానికి..

పాఠశాలలో మూత్రశాలలు, మరుగుదొడ్ల సమస్య తీవ్రంగా ఉంది. విద్యార్థినుల అవసరాలను దృష్టిలో పెట్టుకుని ఉపాధ్యాయులే చొరవ తీసుకున్నారు. సుమారు రూ.40వేల సొంత ఖర్చుతో మరుగుదొడ్ల నిర్మాణ పనులు చేయించారు. మరిన్ని మరుగుదొడ్ల అవసరం ఏర్పడింది. సరిపడా మరుగుదొడ్లు, ఇతర మౌలిక వసతులు కల్పిస్తే విద్యార్థినులకు మెరుగైన బోధన అందించే వీలుంటుంది.

ఆలయ అభివృద్ధికి కృషి



ఆలయంలో పూజా కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారాయణ

నిజామాబాద్ నగరం, న్యూస్‌టుడే: ఆలయ అభివృద్ధికి తనవంతు కృషి చేస్తానని ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారాయణ అన్నారు. ఆదివారం నగరంలో సుభాష్‌నగర్‌లోని రాఘవేంద్ర స్వామి మఠంలో కొనసాగుతున్న ధన్వంతరి ఉత్సవాల్లో ఆయన పాల్గొని మాట్లాడారు. దేశంలోనే రెండో ధన్వంతరి ఆలయం కావడం విశేషమన్నారు. కార్యక్రమంలో భాజపా నాయకులు లక్ష్మీనారాయణ, పవన్, సతీష్ తదితరులున్నారు.

వైభవంగా విగ్రహ ప్రతిష్ఠాపన ఉత్సవాలు



జక్రాన్‌పల్లి, న్యూస్‌టుడే: మండలంలోని కలిగోట్ గ్రామంలో నూతనంగా నిర్మించిన శ్రీరాధా కృష్ణ ఆలయంలో ఆదివారం విగ్రహ ప్రతిష్ఠాపన ఉత్సవాలు వైభవంగా నిర్వహించారు. ఇందులో భాగంగా గ్రామంలో రాధాకృష్ణ విగ్రహాల ఊరేగింపు చేపట్టారు. యజ్ఞం నిర్వహించి భక్తులకు అన్నదానం చేశారు. గ్రామానికి చెందిన శ్రీకృష్ణ యాదవ సంఘం, యువజన సంఘం ఆధ్వర్యంలో రూ.10 లక్షలతో ఈ ఆలయం నిర్మించారు. కార్యక్రమంలో సర్పంచి నాయక రాజు, ఉప సర్పంచి సత్యమ్మ, యాదవ సంఘం సభ్యులు ప్రశాంత్, మోహన్, నర్సయ్య, శ్రీను, గంగాధర్, రాము తదితరులు పాల్గొన్నారు.


అఖండ సప్తాహం

చందూర్, న్యూస్‌టుడే: మోస్రా మండలం చింతకుంట శివారులోని నవనాథ సిద్దేశ్వర ఆలయంలో సోమవారం నుంచి సప్తాహం నిర్వహిస్తున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు.

గోశాలలో నూతన షెడ్డు

చందూర్, న్యూస్‌టుడే: శివయ్య గోశాలలో నూతన కుటీరం నిర్మించి, గోపూజలను ఆదివారం నుంచి ప్రారంభించారు. తాటిపాముల అనురాధ- శంకర్ సహకారం అందించారని సభ్యులు తెలిపారు. కార్యక్రమంలో సర్పంచి మాధవరెడ్డి, ఇందూర్ గోసేవా సమితి వ్యవస్థాపక అధ్యక్షుడు వీరమల్లి రమేష్, అశోక్ పాల్గొన్నారు.

పీఆర్టీయూ నూతన అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులుగా శంకర్, కిషన్



శంకర్

నిజామాబాద్ విద్యావిభాగం: పీఆర్టీయూటీఎస్ జిల్లా కార్యవర్గ ఎన్నికలు జిల్లాలోని న్యూ అంబేడ్కర్ భవన్‌లో ఆదివారం ప్రశాంతంగా జరిగాయి. జిల్లావ్యాప్తంగా 33 మండలాలకు చెందిన కార్యవర్గ సభ్యులంతా ఓటుహక్కు వినియోగించుకున్నారు. మొత్తం 366 మందికి గాను 359 మంది ఓటువేశారు. జిల్లా అధ్యక్ష పదవికి పోటీ పడిన పొద్దుటూరి మోహన్‌రెడ్డిపై అంబెల్లి శంకర్ 11 ఓట్ల మెజారిటీతో గెలిచారు. ప్రధాన కార్యదర్శి పదవికి బరిలో దిగిన వెంకటేశ్వర్ గౌడ్‌పై కిషన్ పైచేయి సాధించి విజేతగా నిలిచారు. ఈయన రెండోసారి నెగ్గారు. అసోసియేట్ అధ్యక్షులుగా అంకం నరేష్, శ్రీనివాస్, మహిళా అసోసియేట్ అధ్యక్షులుగా ఇందూర్ లలిత, సీహెచ్ వరలక్ష్మి, ఉపాధ్యక్షులుగా శ్రీనివాస్‌గౌడ్, సాయన్న, రాజశేఖర్, హన్మాండ్లు, మనోహర్‌రావు, మహిళా ఉపాధ్యక్షులుగా ఆశారాణి, సుజాత, కార్యదర్శులుగా శ్రీనివాస్, గోపాల్, రవి, రామకృష్ణ, కపిల్‌కుమార్, మహిళా కార్యదర్శులుగా శ్రీదేవి, రచన మహాగోయెంకర్ గెలుపొందారు. ఉపాధ్యాయ సమస్యల పరిష్కారానికి నిత్య పోరాటం సాగిస్తామని నూతన అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఈ సందర్భంగా వెల్లడించారు.

సంస్కృతికి ప్రతీక.. తీజ్

ఎల్లారెడ్డి, న్యూస్‌టుడే: బంజారా ప్రజల సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీక తీజ్ ఉత్సవం అని ఎమ్మెల్యే మదన్‌మోహన్‌రావు అన్నారు. ఎల్లారెడ్డి పట్టణంలో ఆదివారం జరిగిన తీజ్ వేడుకల్లో ఆయన పాల్గొని మాట్లాడారు. మన ఆచార, సంప్రదాయాలను భావి తరాలకు అందజేయాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు. లింగారెడ్డిపేట్ కూడలి నుంచి పెద్దచెరువు వరకు గోధుమ బుట్టలతో బంజారా మహిళలు నృత్యం చేస్తూ నిర్వహించిన ర్యాలీ ఆకట్టుకుంది.

గడువు పెంచాలని రాస్తారోకో

పొతంగల్, న్యూస్‌టుడే: పింఛన్ల దరఖాస్తు గడువు పెంచాలని పొతంగల్ గ్రామస్థులు ఆదివారం బస్టాండు వద్ద రాస్తారోకో నిర్వహించారు. వికలాంగులు, వితంతువులు, ఒంటరి మహిళలు తదితర పింఛన్ల గడువును ప్రభుత్వం ఈ నెల 31 వరకు ఇచ్చిందని ఆ గడువులోగా వారికి అవసరమయ్యే ధ్రువపత్రాలు అందడం లేదన్నారు. పింఛన్‌దారుల ఇబ్బందులను దృష్టిలో పెట్టుకుని గడువును పొడిగించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో హన్మాండ్లు, పోశెట్టి, పండరి, లాలయ్య, మోహన్ తదితరులు పాల్గొన్నారు.



పొతంగల్‌లో రాస్తారోకో నిర్వహిస్తున్న గ్రామస్థులు

'పాంచజన్య పథకాలతో టీఆర్ఎస్‌కు అధికారం'

సదాశివనగర్, న్యూస్‌టుడే: టీఆర్ఎస్(తెలంగాణ రక్షణ సేన) అధినేత కల్వకుంట్ల కవిత ప్రకటించిన పాంచజన్య పథకాలతోనే రాష్ట్రంలో తాము అధికారంలోకి వస్తామని ఆ పార్టీ ఎల్లారెడ్డి నియోజకవర్గ ఇన్‌ఛార్జి సంపత్‌గౌడ్ ధీమా వ్యక్తం చేశారు. మండలంలోని అడ్లూర్ ఎల్లారెడ్డి, అమర్లబండ, తుక్కోజివాడి గ్రామాలకు చెందిన పలువురు నాయకులు ఆదివారం సదాశివనగర్‌లో జరిగిన కార్యక్రమంలో టీఆర్ఎస్‌లో చేరారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. ప్రతీ ఒక్కరికి ఉచిత వైద్యం, విద్య అందించాలనే లక్ష్యంతో తమ పార్టీ ముందుకెళ్తుందన్నారు. పార్టీ మండల అధ్యక్షుడు సాయాగౌడ్, సోషల్ మీడియా ఇన్‌ఛార్జి శ్రీకాంత్‌రెడ్డి, లింగం, సాయిలు, రాజయ్య తదితరులు పాల్గొన్నారు.

కానిస్టేబుల్ కుటుంబానికి చేయూత

బాన్సువాడ, న్యూస్‌టుడే: ఇటీవల గుండెపోటుతో మృతిచెందిన బాన్సువాడ పట్టణానికి చెందిన కానిస్టేబుల్ రఘు కుటుంబానికి జిల్లా పోలీస్ ఆఫీసర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు రంజిత్‌రెడ్డి రూ.2.96 లక్షల ఆర్థికసాయం ఆదివారం అందించారు. రఘు, రాజేశ్వర్‌రెడ్డి, శంకర్, ప్రవీణ్, సతీష్, బాశెట్టి తదితరులున్నారు.

ఎస్సారెస్పీకి పెరిగిన వరద



శ్రీరామసాగర్ ప్రాజెక్టులోకి ఎగువ నుంచి 2180 క్యూసెక్కుల వరద వచ్చి చేరుతోంది. ప్రాజెక్టు పూర్తి స్థాయి నీటిమట్టం 1091 అడుగులు కాగా ఆదివారం సాయంత్రం 44.713 అడుగుల వరకు ఉంది. 80.501 టీఎంసీల నీటి నిల్వ సామర్థ్యం కాగా 44.713 టీఎంసీల నీటి నిల్వ ఉంది. కాకతీయ కాల్వ ద్వారా 250, మిషన్ భగీరథ ద్వారా 231 క్యూసెక్కుల చొప్పున నీటి విడుదల జరుగుతోంది. 482 క్యూసెక్కుల నీరు ఆవిరి రూపంలో తగ్గుతోంది. **శ్రీరామసాగర్, న్యూస్‌టుడే**

శివాజీ ధైర్యసాహసాలు స్ఫూర్తిదాయకం

ఎల్లారెడ్డి, న్యూస్‌టుడే: ఛత్రపతి శివాజీ మహారాజ్ ధైర్యసాహసాలు నేటి యువతకు స్ఫూర్తిదాయకం అని భాజపా రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు పైడి ఎల్లారెడ్డి అన్నారు. ఎల్లారెడ్డి మండలం మత్తమాల గ్రామంలో ఆదివారం ఆయన ఛత్రపతి శివాజీ మహారాజ్ విగ్రహాన్ని ఆవిష్కరించి మాట్లాడారు. యువతలో దేశభక్తిని పెంపొందించడానికి కృషి చేసిన శివాజీ మహారాజ్‌ను యువకులు ఆదర్శంగా తీసుకుని ముందుకు సాగాలని సూచించారు. కార్యక్రమంలో భాజపా జిల్లా అధ్యక్షుడు నీలం చిన్న రాజులు, దాత రాంగోపాల్‌రెడ్డి, ప్రతినిధులు అనుసుజారెడ్డి, రవీందర్‌రావు, భారతమ్మ, జలంధర్‌రెడ్డి, ఉషాగౌడ్, నర్సింలు, వినోద్, తులసీదాస్ పాల్గొన్నారు.

ఏళ్లుగా .. అసంపూర్తిగా..



నవీపేటలో 12 ఏళ్ల క్రితం రూ.5లక్షల వ్యయంతో నిర్మించిన వ్యవసాయ శాఖ కార్యాలయ భవనం అసంపూర్తి పనులతో అర్థాంతరంగా నిలిచిపోయింది. అదనపు నిధులు మంజూరు చేసి కార్యాలయాన్ని వినియోగంలోకి తీసుకురావాలని రైతులు కోరుతున్నారు.
– న్యూస్‌టుడే, నవీపేట

ఎలుకల భయం .. కేంద్రానికి తాళం



ఎడపల్లి వార అంగడి ప్రాంగణంలో నిర్మించిన అంగన్‌వాడీ కేంద్రాన్ని ఎలుకలు, పందికొక్కుల బెడద వేధిస్తోంది. పక్కనే నిర్మించిన చేపల విక్రయ కేంద్రం, కూరగాయల షెడ్డు పరిసరాలు అధ్వానంగా మారాయి. చేపల విక్రయ కేంద్రంలో ఎలుకలు, పందికొక్కులు సంచరిస్తున్నాయి. రాత్రి వేళల్లో అంగన్‌వాడీ కేంద్రంలోకి వచ్చి బియ్యం, ఇతర సరకులను తినేస్తున్నాయి. గదులను అపరిశుభ్రంగా మారుస్తున్నాయి. చేసేదేమీ లేక కేంద్రాన్ని స్థానికంగా ఉన్న ఓ కిరాయి భవనంలోకి మార్చారు. **– న్యూస్‌టుడే, ఎడపల్లి**

కుంగిన రోడ్డు .. ప్రమాదాలకు నెలవు



బోధన్ పట్టణంలోని శక్కర్‌నగర్ నుంచి నర్సాపూర్ వెళ్లే రోడ్డు పూర్తిగా దెబ్బతింది. శ్రీరామ కాలనీ సమీపంలో రోడ్డు కింద నుంచి గతంలో నీటి సరఫరా కోసం ఏర్పాటు చేసిన పైపు ధ్వంసం కావడంతో ఈ ప్రాంతంలో రోడ్డు కుంగిపోయింది. స్థానికులు అందులో ఓ బండ రాయిని ఏర్పాటు చేశారు. ఏ మాత్రం ఆదమరిచి వాహనాలను నడిపినా ప్రమాదాల బారిన పడే అవకాశముంది. రాత్రివేళ ఈ గుంత కనిపించక వాహనదారులు ప్రమాదాల బారిన పడుతున్నారు. మరమ్మతులు చేయించాలని కోరుతున్నారు. **– న్యూస్‌టుడే, బోధన్ పురపాలిక**

సీసీ రోడ్డు పనులు ప్రారంభం



పాల్గొన్న సర్పంచి, స్థానికులు

ఎడపల్లి, న్యూస్‌టుడే: ఏఆర్పీ క్యాంపులో ఆదివారం సిమెంటు రోడ్డు పనులను సర్పంచి వినోద్ ప్రారంభించారు. 6వ వార్డులో ఎస్సీ సబ్ ప్లాన్ నిధులు రూ.5లక్షలతో ఈ పనులు చేపట్టారు. కార్యక్రమంలో రంజిత్, బాబా, రాము గౌడ్, శ్రీనివాస్ గౌడ్, శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు.

సీసీ కెమెరాలతో నేరాల నియంత్రణ

వర్ని, న్యూస్‌టుడే: సీసీ కెమెరాల ద్వారా నేరాలు నియంత్రించడంతో పాటు అసాంఘిక కార్యక్రమాలు జరగకుండా అరికట్టవచ్చని ఎస్సై వంశీకృష్ణారెడ్డి పేర్కొన్నారు. వర్ని ఠాణా ఆధ్వర్యంలో సిద్ధాపూర్ గ్రామంలో సీసీ కెమెరాల ఏర్పాటు పై ఆదివారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. గ్రామాల్లోని ప్రధాన కూడళ్లలో సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. చోరీల నివారణకు ప్రతీ ఒక్కరూ సహకరించాలని కోరారు. సమావేశంలో సర్పంచి బాల్‌సింగ్, సొసైటీ ఛైర్మన్ దశరథ్, గ్రామస్థులు పాల్గొన్నారు.

మిలాద్ ఉన్ నబి వేడుకలు



నవీపేటలో ర్యాలీ

నవీపేట, న్యూస్‌టుడే: నవీపేటలో మిలాద్ ఉన్ నబి వేడుకలను ఆదివారం వైభవంగా నిర్వహించారు. ఈ మేరకు పట్టణంలోని పుర వీధుల్లో ర్యాలీ చేపట్టారు. నిజామాబాద్ నార్త్ రూరల్ సీఐ శ్రీనివాస్, ఎస్సై శ్రీకాంత్ ఆధ్వర్యంలో భారీ బందోబస్తు నిర్వహించారు.

బాధితులకు పరామర్శ

రుద్రూర్, న్యూస్‌టుడే: రుద్రూర్ గ్రామానికి చెందిన భారాస కార్యకర్త బొట్టె గజేందర్ యాదవ్ తండ్రి బొట్టె దేవన్న, వర్ని పోలీసు ఠాణాలో పని చేసే ఏఎస్సై వంజరి శంకర్‌లు ఇటీవల అనారోగ్యంతో చెందారు. ఈ మేరకు బాన్సువాడ నియోజకవర్గ ఇన్‌ఛార్జి బాజిరెడ్డి గోవర్ధన్, మాజీ ఎమ్మెల్సీ వీజీ గౌడ్‌లు ఆదివారం రాత్రి బాధిత కుటుంబాలను పరామర్శించారు. చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. వెంట మధు, దవుర సాయిలు, తెల్ల రవి, ఎజాజ్, హన్మండ్లు, శంకర్ తదితరులు ఉన్నారు.



దేవన్న చిత్రపటానికి నివాళులర్పిస్తున్న బాజిరెడ్డి గోవర్ధన్, మాజీ ఎమ్మెల్సీ వి.జి.గౌడ్

నూతన కార్యవర్గాల ఎన్నిక

నిజామాబాద్ విద్యావిభాగం, న్యూస్‌టుడే: జిల్లా మండల సమన్వయకర్తలు(ఎంఐఎస్) ఆదివారం జిల్లా కేంద్రంలో సమావేశమై నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా సిహెచ్. ప్రసాద్, ప్రధాన కార్యదర్శిగా ఎం.నవీన్, కోశాధికారిగా సోమ రాజు, ఉపాధ్యక్షుడిగా చిన్నారెడ్డి, గౌరవ అధ్యక్షుడిగా శంకర్, నిర్వహణ కార్యదర్శిగా షాబాజ్, సలహాదారుగా ఎబ్నేజె ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు వివరించారు.

నిజామాబాద్ అర్బన్, న్యూస్‌టుడే: నగరంలోని ఈస్ట్ బ్యాంక్ కాలనీ(పాంగ్రా) వెల్ఫేర్ సొసైటీ ఎన్నికలు ఆదివారం జరిగాయి. అధ్యక్షుడిగా వినోద్‌కుమార్, ప్రధాన కార్యదర్శిగా గణేశ్, కోశాధికారిగా రాజయ్యను ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు.

సుభాష్‌నగర్, న్యూస్‌టుడే: నగరంలోని వినాయక్‌నగర్ కొత్త హౌసింగ్‌బోర్డుకాలనీ ఆదివారం కమిటీ నూతన కార్యవర్గం ఎన్నికైంది. కాలనీలోని ప్రసన్నాంజనేయ ఆలయంలో జరిగిన ఎన్నికల్లో అధ్యక్షునిగా సాయగౌడ్, ప్రధాన కార్యదర్శిగా వెంకట నర్సయ్య, కోశాధికారిగా రవి గౌడ్, ఉపాధ్యక్షునిగా సునీల్ జాదవ్, సంయుక్త కార్యదర్శిగా వినోద్‌కుమార్ ఎన్నికయ్యారు.



మాజీ సర్పంచి కుటుంబానికి ఆర్థికసాయం

బాన్సువాడ, వర్ని న్యూస్‌టుడే: వర్ని మండలం తగిలేపల్లి మాజీ సర్పంచి వెంకన్న కుటుంబానికి బాన్సువాడ ఎమ్మెల్యే పోచారం శ్రీనివాస్‌రెడ్డి రూ.లక్ష ఆర్థికసాయాన్ని బాన్సువాడ పట్టణంలోని తన నివాసంలో ఆదివారం అందజేశారు. కుటుంబానికి అండగా ఉంటామని హామీ ఇచ్చారు. ఎమ్మెల్యేతో పాటు నిజామాబాద్ డీసీసీబీ మాజీ అధ్యక్షుడు పోచారం భాస్కర్‌రెడ్డి, వర్ని మండల నాయకులున్నారు.



మాజీ సర్పంచి వెంకన్న కుటుంబానికి ఆర్థిక సాయం చేస్తున్న ఎమ్మెల్యే పోచారం శ్రీనివాస్‌రెడ్డి

దూషించిన వ్యక్తిపై ఫిర్యాదు

బీర్కూర్: తనను అసభ్య పదజాలంతో దూషించిన వ్యక్తిపై చర్యలు తీసుకోవాలంటూ బరంగెడ్గి గ్రామ సర్పంచి రెంజర్ల అనిల్ ఆదివారం బీర్కూర్ పోలీసు ఠాణాలో ఫిర్యాదు చేశారు. బరంగెడ్గి గ్రామంలో రోడ్డుకు ఇరువైపులా డ్రైనేజీ నిర్మాణం కొనసాగుతోంది. ఇందూర్ గజేందర్ ఇంటి ముందు అరుగు తీయకుండా గుత్తేదారుడు డ్రైనేజీని వంకరగా నిర్మిస్తుండగా సర్పంచి గమనించారు. నిబంధనల ప్రకారం అరుగు తీసి డ్రైనేజీని సమాంతరంగా నిర్మించాలంటూ సర్పంచి గుత్తేదారుడికి సూచిస్తుండగా.. గజేందర్ జోక్యం చేసుకుని తనను అసభ్యపదజాలంతో దూషించినట్లు ఫిర్యాదు చేశాడు.

ఆలయంలో చోరీ.. గాంధారి, న్యూస్‌టుడే: పొతంగల్ కలాన్ బుగ్గరామేశ్వరాల ఆలయంలో శనివారం రాత్రి చోరీకి పాల్పడ్డారు. ఆలయంలోని రెండు హుండీలను పగులగొట్టి వాటిలోని రూ.8 వేల నగదు ఎత్తుకెళ్లారు.

గుర్తు తెలియని వ్యక్తి మృతి

బోధన్ పురపాలిక, న్యూస్‌టుడే: నిజామాబాద్ జీజీహెచ్‌లో చికిత్స పొందుతూ గుర్తు తెలియని వ్యక్తి (55) శనివారం మృతి చెందినట్లు బోధన్ పట్టణ సీఐ వెంకటనారాయణ తెలిపారు. ఆయన కథనం ప్రకారం.. బోధన్‌లోని శక్కర్‌నగర్ చౌరస్తాలో ఈ నెల 21న భిక్షాటన చేస్తూ అపస్మారక స్థితిలో ఉన్న వ్యక్తిని బోధన్ పోలీసులు గుర్తించి స్థానిక జిల్లా ప్రభుత్వ దవాఖానాలో చేర్పించారు. పరిస్థితి విషమంగా ఉండటంతో మెరుగైన చికిత్స నిమిత్తం జీజీహెచ్‌కు తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ శనివారం చనిపోయారు. మృతదేహాన్ని నిజామాబాద్ ప్రభుత్వ దవాఖానా మార్చురీలో భద్రపరిచినట్లు సీఐ వివరించారు. ఆచూకీ తెలిసిన వారు బోధన్ పోలీసులను సంప్రదించాలని కోరారు.

లారీ బోల్తా

జక్రాన్‌పల్లి, న్యూస్‌టుడే: జక్రాన్‌పల్లి వద్ద 44వ నంబరు జాతీయ రహదారిపై ఆదివారం తెల్లవారుజామున టమాటా లోడ్‌తో వెళుతున్న లారీ బోల్తాపడింది. ఆంధ్రప్రదేశ్‌లోని అనంతపురం జిల్లా నుంచి ఉత్తర్‌ప్రదేశ్‌కు వెళుతుండగా ఈ ప్రమాదం చోటుచేసుకుంది. డ్రైవర్ అర్షద్ స్వల్ప గాయాలతో బయటపడ్డాడు. పోలీసులు ఘటనా స్థలాన్ని పరిశీలించారు.

విద్యుత్తు నియంత్రిక ధ్వంసం



జక్రాన్‌పల్లి, న్యూస్‌టుడే: మండలంలోని అర్గుల్ గ్రామంలో వ్యవసాయ విద్యుత్తు నియంత్రికను శనివారం అర్ధరాత్రి గుర్తుతెలియని దుండగులు ధ్వంసం చేశారు. అందులోని రాగి తీగలు, ఆయిల్ చోరీ చేశారు. ఘటనపై పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు ట్రాన్స్‌కో ఏఈ ప్రవీణ్ చెప్పారు.

నాలుగు మేకల మృత్యువాత

మోపాల్, న్యూస్‌టుడే: మోపాల్ గ్రామానికి చెందిన సాయిచంద్‌కు చెందిన నాలుగు మేకలు విద్యుదాఘాతానికి గురై ఆదివారం మృత్యువాత పడ్డాయి. కంజర పరిసరాల్లో మేతకు వెళ్లగా.. వాగులో నీరు తాగేందుకు వెళ్లినప్పుడు మోటారుకు సంబంధించిన విద్యుత్తు తీగతో ఈ ప్రమాదం చోటుచేసుకుంది. తనకు రూ.50 వేల ఆర్థిక నష్టం వాటిల్లిందని సాయిచంద్ వాపోయారు. ఘటనా స్థలాన్ని సర్పంచి రవికుమార్, లైన్ ఇన్‌స్పెక్టర్ నజీరొద్దీన్ పరిశీలించారు.

13 క్వింటాళ్ల పీడీఎస్ బియ్యం పట్టివేత

నిజామాబాద్ నేరవిభాగం, న్యూస్‌టుడే: నగరంలోని హాష్మీకాలనీ శివారులోని ఓ ఇంట్లో పీడీఎస్ బియ్యం నిల్వ ఉంచారనే సమాచారంతో పోలీసులు దాడులు చేశారు. 13 క్వింటాళ్ల బియ్యం నిల్వ ఉంచినట్లు గుర్తించి వాటిని స్వాధీనం చేసుకున్నారు. విచారించి వివరాలు వెల్లడిస్తామని ఐదో ఠాణా పోలీసులు ఆదివారం తెలిపారు.

ఆర్మూర్

• ఆర్మూర్ • బాల్కొండ

శ్రీకృష్ణ జన్మాష్టమికి ఏర్పాట్లు

ఆర్మూర్ న్యూస్‌టుడే: ఆర్మూర్ ఇస్కాన్ కేంద్రం ఆధ్వర్యంలో సెప్టెంబరు 5న నిర్వహించనున్న శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకలకు సంబంధించిన కరపత్రాలను ఆదివారం నిజామాబాద్ కంఠేశ్వర్ ఇస్కాన్ అధ్యక్షుడు రామనంద రాయగౌరవదాస్ ప్రభుజీ ఆవిష్కరించారు. ఆయన మాట్లాడుతూ.. పట్టణంలోని బాలాజీ ఫంక్షన్‌హాల్‌లో వేడుకలను ఘనంగా నిర్వహించనున్నట్లు తెలిపారు. నిమయదాస్, సీతాపతి, భరత్, శ్రీకర్, మోహన్ తదితరులు పాల్గొన్నారు.



కరపత్రాలను ఆవిష్కరిస్తున్న ప్రతినిధులు

ఘనంగా తీజ్ పండుగ

నందిపేట్, న్యూస్‌టుడే: డొంకేశ్వర్ మండలం నికాల్‌పూర్‌లో ఆదివారం తీజ్ పండుగను ఘనంగా నిర్వహించారు. ఉదయం పూజలు నిర్వహించారు. వారు పెంచుకున్న మొక్కలను గ్రామంలో ఊరేగించారు. నృత్యాలు చేస్తూ సందడి చేశారు. సర్పంచి అనిత తదితరులు పాల్గొన్నారు.



మేమున్నాం.. మీకు తోడుగా..
99637 26255 (భీమ్‌గల్)
99668 83996 (ఆర్మూర్)

స్తంభాన్ని సరి చేశారు

మోర్తాడ్, న్యూస్‌టుడే: మోర్తాడ్ రైల్వేస్టేషన్ రోడ్డులో విద్యుత్తు స్తంభం పూర్తిగా ఓ వైపునకు వంగిపోయింది. శుక్రవారం 'ఈనాడు'లో 'ప్రమాదం జరిగితేనే.. పట్టించుకుంటారా..' అనే శీర్షికన చిత్రకథనం ప్రచురితమైంది. స్పందించిన విద్యుత్తు శాఖ అధికారులు వంగిన స్తంభాన్ని సరిచేయించారు.

ఏకరూపం.. బహుదూరం

☛ ఇంకా అందని దుస్తులు

ఆర్మూర్, న్యూస్‌టుడే:

విద్యా సంవత్సరం జూన్ 15 నుంచి ప్రారంభమైంది. చాలా మంది ప్రభుత్వ పాఠశాలల్లో చేరారు. ఇప్పటి వరకు విద్యార్థులకు ఏకరూప దుస్తులు అందించలేదు. కొందరు సాధారణ దుస్తులతో.. మరికొందరు గతేడాది ఇచ్చిన ఏకరూప దుస్తులతో పాఠశాలకు వస్తున్నారు. గత రెండు నెలలుగా విద్యార్థులు ఎదురుచూడాల్సిన పరిస్థితి నెలకొంది. ఈ ఏడాది అంగన్‌వాడీ, ప్రీప్రైమరీ, ప్రాథమిక, ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలలతో పాటు కేజీబీవీ విద్యార్థులకు ఒకే రకమైన ఏకరూప దుస్తులను అందించనున్న నేపథ్యంలో ఆలస్యం జరిగినట్లు అధికారులు చెబుతున్నారు.

ఆర్మూర్ డివిజన్‌లో..
ప్రభుత్వ పాఠశాలలు **408**
విద్యార్థుల సంఖ్య: **27,389**

కొనసాగుతున్న కుట్టే ప్రక్రియ

ఈ ఏడాది జులై మొదటి వారంలో మహిళా సంఘాలకు వస్త్రం అందించారు. ఆగస్టు 15వ తేదీలోగా ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు ఏకరూప దుస్తులు ఇవ్వాలని అధికారులు భావించారు. ఇప్పటికీ కుట్టే ప్రక్రియ కొనసాగుతోంది. మరో పక్షం రోజుల్లో రెండు జతల చొప్పున దుస్తులు విద్యార్థులకు పంపిణీ చేసేందుకు కసరత్తు చేస్తున్నామని విద్యాశాఖ అధికారులు చెబుతున్నారు.

☛ ఈ విషయమై జిల్లా విద్యాశాఖాధికారి అశోక్ మాట్లాడుతూ.. 'జిల్లాలోని ప్రభుత్వ పాఠశాలల్లో చదువుకుంటున్న విద్యార్థులకు మరో 15 రోజుల్లో ఏకరూప దుస్తులు అందించేలా చర్యలు తీసుకుంటున్నాం. దుస్తులు కుట్టే ప్రక్రియపై ఎప్పటికప్పుడు ఆరా తీస్తున్నాం. వచ్చే నెల15లోగా ప్రతీ విద్యార్థికి దుస్తులు పంపిణీ చేసేలా చూస్తాం" అని చెప్పారు.

చిత్తడిగా దారులు.. ప్రజలకు తిప్పలు

▶ రాజారాంనగర్‌లో రోడ్లపై మొరం పోశారు. చిన్నపాటి వర్షానికే చిత్తడిగా మారుతోంది. నడవడం కష్టంగా ఉంటుందని పలువురు అంటున్నారు.

▶ 23వ వార్డులో రోడ్డుపై వర్షపు నీరు నిలుస్తోంది. చిన్నపాటి కుంటను తలపిస్తోంది

▶ ఆర్మూర్ పట్టణంలోని మార్కెట్ రోడ్డు గుంతలమయంగా మారింది. ప్రయాణికులకు ఇబ్బంది పడుతున్నారు.

ఆర్మూర్, న్యూస్‌టుడే: ఆర్మూర్ పట్టణంలోని రహదారులు పూర్తిగా దెబ్బతిని ప్రజలకు తీవ్ర ఇబ్బందులు కలిగిస్తున్నాయి. చిన్నపాటి వర్షానికే రోడ్లపై నీరు నిలిచిపోతోంది. గుంతలు కనిపించకపోవడంతో ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయి. ప్రధాన రహదారులతో పాటు కాలనీల్లోని అంతర్గత వీధులు అధ్వానంగా మారడంతో స్థానికులు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. ప్రగతి పనులు చేపట్టి వార్డుల రూపురేఖలు మార్చాల్సిన పాలకులు నిర్లక్ష్యం వహిస్తున్నారు. అభివృద్ధి పనులకు శ్రీకారం చుట్టాల్సిన యంత్రాంగం చోద్యం చూస్తోంది. వార్డుల్లో సీసీ రోడ్లు లేక వాహనదారులకు ఇబ్బందులు తప్పడం లేదు. ఎక్కడ చూసినా గుంతలు, ఎగుడు దిగుడు రోడ్లు కనిపిస్తున్నాయి. ఇటీవల కురిసిన వర్షాలతో గుంతల్లో నీరు నిలిచి ప్రయాణం మరింత ప్రమాదకరంగా మారింది. ముఖ్యంగా ద్విచక్ర వాహనదారులు అదుపు తప్పి కిందపడుతున్నారు.



రాజారాంనగర్‌లో బురదమయంగా మారిన రోడ్డు

సర్వే చేపడితేనే...

అంతర్గత ప్రాంతాల్లో గుంతలు ఎన్ని ఉన్నాయో సర్వే చేసి వివరాలను నమోదు చేయాలి. ప్రాథమికంగా గుంతలు పూడ్చేందుకు ప్రాధాన్యం ఇచ్చి ఆ తర్వాత శాశ్వత పనులపై దృష్టి సారించాలి. పట్టణంలో దాదాపుగా 100కు పైగా గుంతలు ఉన్నాయి. ఈ విషయమై **పురపాలక ఏఈ కిరణ్** స్పందిస్తూ గుంతలు పూడ్చేందుకు ప్రతిపాదనలు రూపొందిస్తామన్నారు.

పీవీఆర్ మల్టీప్లెక్స్ (ఆర్మూర్) — ఈనాడు సినిమాలు

స్క్రీన్–1: **ఇరుముడి:** 10:45, 1:30, 4:30, 7:30, 10.30

స్క్రీన్–2: **టాక్సిక్:** 2:00, 6:00, 10:00

స్క్రీన్–3: **విశ్వనాథ్ అండ్ సన్స్:** 1:20, 7:40

స్క్రీన్–4: **ఇరుముడి:** 10:15, 11:00(రాత్రి)

న్యూస్‌టుడే, ఆర్మూర్

ప్రమాదంలో దంపతులకు గాయాలు

ఆర్మూర్ న్యూస్‌టుడే: ఆర్మూర్ పట్టణంలోని పెర్కిట్ వద్ద ఆదివారం రోడ్డు ప్రమాదం జరిగింది. పిప్రి గ్రామానికి చెందిన సాయిరెడ్డి, సంధ్య దంపతులు పెర్కిట్‌లో వివాహానికి ద్విచక్రవాహనంపై వెళ్తున్నారు. జాతీయ రహదారిపై లారీ ఢీకొట్టింది. ప్రమాదంలో ఇద్దరికి గాయాలయ్యాయి. క్షతగాత్రులను చికిత్స నిమిత్తం ఆర్మూర్ ఏరియా ఆసుపత్రికి తరలించారు. పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని వివరాలు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

భవన నిర్మాణ పనుల పరిశీలన

కమ్మర్‌పల్లి, న్యూస్‌టుడే: మానాలలో గిరిజన ఆశ్రమ పాఠశాల భవన నిర్మాణ పనులను ఎమ్మెల్యే వేముల ప్రశాంత్‌రెడ్డి ఆదివారం పరిశీలించారు. ఆలస్యమవుతున్న పనులపై అధికారులను ప్రశ్నించగా మూడు నెలల్లో పూర్తి చేస్తామని పేర్కొన్నారు. భవన నిర్మాణ పనులు తొందరగా పూర్తయితే, వేములవాడలో తాత్కాలిక భవనంలో కొనసాగుతున్న పాఠశాలను మానాలకు తరలించడానికి ఆస్కారం ఉంటుందన్నారు.



దరఖాస్తుకు నేడు చివరి రోజు

ఆర్మూర్, న్యూస్‌టుడే: ఆర్మూర్ మున్సిపల్ కార్యాలయంలో చేయూత పెన్షన్ పథకానికి అర్హులైన వారి నుంచి దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు మున్సిపల్ ఛైర్‌పర్సన్ లహరి తెలిపారు. సోమవారం సాయంత్రం వరకు దరఖాస్తు చేసుకునే అవకాశం ఉందని ఆమె పేర్కొన్నారు.

ఓటర్లకు సహాయం చేయాలి

మోర్తాడ్, న్యూస్‌టుడే: జాబితాలో పేర్లు, వివరాలు తప్పుగా నమోదైన వారికి అధికారులు నోటీసులు ఇస్తున్నారని, ఇలాంటి వారికి బీఎల్‌ఏలు అవసరమైన సహాయం అందించాలని కాంగ్రెస్ పార్టీ బాల్కొండ నియోజకవర్గ ఇన్‌ఛార్జి ముత్యాల సునీల్‌కుమార్ పేర్కొన్నారు. ఆదివారం మండల కేంద్రంలోని ఓ వేడుకల మందిరంలో 'సర్'పై కాంగ్రెస్ పార్టీ బూత్ లెవల్ ఏజెంట్లకు అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నోటీసులు అందుకున్న వారు ఎన్నికల కమిషన్ సూచించిన ఏదైనా గుర్తింపు కార్డులు బీఎల్‌వోలకు చూపే విధంగా నాయకులు సహాయ పడాలన్నారు. గ్రామాల్లో ఓట్లు తొలగకుండా కృషి చేయాలన్నారు. ప్రజాస్వామ్యంలో ఓటు చాలా విలువైనదని అన్నారు. సర్ ఇన్‌ఛార్జి వరప్రసాద్, మండల అధ్యక్షుడు బక్కూరి ఆనంద్, నాయకులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ముత్యాల సునీల్‌కుమార్

అఖండ సప్తాహం : చందూర్, న్యూస్‌టుడే: మోస్రా మండలం చింతకుంట శివారులోని నవనాథ సిద్దేశ్వర ఆలయంలో సోమవారం నుంచి సప్తాహం నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు.

ఎస్సారెస్పీలో 44.713 టీఎంసీలు



శ్రీరామసాగర్ ప్రాజెక్టులోకి ఎగువ నుంచి 2180 క్యూసెక్కుల వరద వచ్చి చేరుతోంది. ప్రాజెక్టు పూర్తి స్థాయి నీటిమట్టం 1091 అడుగులు కాగా ఆదివారం సాయంత్రం 44.713 అడుగుల వరకు ఉంది. 80.501 టీఎంసీల నీటి నిల్వ సామర్థ్యం కాగా 44.713 టీఎంసీల నీటి నిల్వ ఉంది. కాకతీయ కాల్వ ద్వారా 250, మిషన్ భగీరథ ద్వారా 231 క్యూసెక్కుల చొప్పున నీటి విడుదల జరుగుతోంది. 482 క్యూసెక్కుల నీరు ఆవిరి రూపంలో తగ్గుతోంది. –న్యూస్‌టుడే, శ్రీరామసాగర్

ప్రాథమిక పాఠశాలలో స్వచ్ఛభారత్

ఆర్మూర్, న్యూస్‌టుడే: మహాత్మా స్వచ్ఛంద సేవా సంస్థ ఆధ్వర్యంలో ఆర్మూర్ పట్టణంలోని జిరాయత్‌నగర్ ప్రాథమిక పాఠశాలలో ఆదివారం స్వచ్ఛభారత్ నిర్వహించారు. పిచ్చిమొక్కలు, చెత్తాచెదారాన్ని తొలగించి పరిసరాలను శుభ్రం చేశారు. ఈ సందర్భంగా సంస్థ వ్యవస్థాపక అధ్యక్షుడు సుంకె శ్రీనివాస్ మాట్లాడుతూ ప్రతి ఆదివారం ఒక గంట నినాదంతో నిర్వహిస్తున్న స్వచ్ఛ కార్యక్రమం 69వ వారానికి చేరుకుందని తెలిపారు.



లేబర్ కార్డు.. ప్రయోజనాలు బోలెడు

భీమ్‌గల్(ఆర్మూర్), న్యూస్‌టుడే:

రెక్కాడితే గానీ డొక్కాడని భవన నిర్మాణ, ఇతర అసంఘటిత రంగ కార్మికులకు ప్రభుత్వం అందిస్తున్న వరం లేబర్ కార్డు. ఈ ఒక్క కార్డు ఉంటే కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నుంచి బోలెడు ప్రయోజనాలు పొందవచ్చు. తెలంగాణ భవన, ఇతర నిర్మాణ కార్మికుల సంక్షేమ బోర్డు ద్వారా లేబర్ కార్డులు జారీ చేస్తారు. వివాహం, ప్రసూతి, ప్రమాదాలు, సహజ మరణం, ఆసుపత్రి చికిత్స తదితర సందర్భాల్లో ఆర్థిక సాయం పొందే వీలుంది. 18-60 ఏళ్ల వయసు ఉన్న కార్మికులు కుటుంబ సభ్యుల ఆధార్, నామినీ, రేషన్‌కార్డు, బ్యాంకు ఖాతా వివరాలతో మీసేవలో నిర్ణీత రుసుము చెల్లించి లేబర్ కార్డు పొందాల్సి ఉంటుంది.

నిబంధనలు...

కార్డు రిజిస్ట్రేషన్ కోసం గడిచిన 12 నెలల్లో కనీసం 90 రోజులు భవన నిర్మాణ రంగంలో పని చేసి ఉండాలి. ఒకసారి నమోదు చేసుకుంటే అయిదు సంవత్సరాలు చెల్లుబాటు అవుతుంది. ఆ తర్వాత రెన్యువల్ చేసుకోవాలి. ఆర్థిక ప్రయోజనం అందుకోవడానికి కార్డు రిజిస్ట్రేషన్ ఏడాది పూర్తి కావాలనే నిబంధన వర్తిస్తుందని కార్మిక శాఖ అధికారులు తెలుపుతున్నారు.

ఆర్మూర్ కార్మికశాఖ పరిధిలో	
కార్మికులు	10,629
రెన్యువల్ చేసుకున్నవారు	3032
లబ్ధిపొందినవారు	565

ఉపయోగాలు ఇలా...

➡ కార్మికులకు సీఎస్సీ ద్వారా ఏడాదికి ఒకసారి ఉచిత వైద్య పరీక్షలు నిర్వహిస్తారు..

➡ నైపుణ్యాల పెంపు కోసం న్యాక్ ద్వారా శిక్షణ కల్పించి ధ్రువీకరణ పత్రాలు జారీ చేస్తారు. శిక్షణ సమయంలో ఉపకార వేతనం అందిస్తారు.

➡ ప్రసూతి తేదీ నుంచి ఏడాది లోపు దరఖాస్తు చేసుకుంటే లేబర్ కార్డుదారులకు లేదా వారి కుమార్తె వివాహానికి, రెండు కాన్పులకు రూ.30 వేల చొప్పున ప్రయోజనం అందిస్తారు. కార్డు రిజిస్ట్రేషన్ చేసుకొని ఏడాది పూర్తయితేనే ఈ సాయం అందుతుంది..

➡ ప్రమాదవశాత్తు మరణిస్తే నామినీకి రూ.10 లక్షలు, సహజ మరణానికి రూ.2 లక్షలు, శాశ్వత అంగవైకల్యానికి రూ.4 లక్షలు చొప్పున పరిహారం అందిస్తారు. ఒకవేళ ఏదైనా జబ్బుతో ఆసుపత్రిలో చేరి అయిదు రోజుల కంటే ఎక్కువ రోజులు చికిత్స పొందితే నెలకు రూ.4,500 చొప్పున 3 నెలలు చెల్లిస్తారు.

సొంతింటి కల నెరవేరుతోంది..

మాక్లూర్, న్యూస్‌టుడే: ఎన్నో ఏళ్లుగా పేదలు కంటున్న సొంతింటి కల ఎట్టకేలకు కాంగ్రెస్ ప్రభుత్వం ద్వారా నెరవేరుతోందని ఆ పార్టీ మండల అధ్యక్షుడు దయాకర్‌రావు పేర్కొన్నారు. మానిక్‌బండార్‌లో ఆదివారం నిర్వహించిన ఇందిరమ్మ గృహప్రవేశాల కార్యక్రమానికి ఆయన హాజరయ్యారు. లబ్ధిదారులను సన్మానించిన తర్వాత మాట్లాడారు. అన్ని వర్గాల ప్రజల అభ్యున్నతి కోసం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఎంతగానో కృషి చేస్తున్నారని కొనియాడారు. ప్రతిపక్షాలు చేస్తున్న తప్పుడు ప్రచారాన్ని తిప్పికొట్టాలని కార్యకర్తలకు సూచించారు. రాజీవ్‌గాంధీ పంచాయతీరాజ్ సంఘటన్ జిల్లా అధ్యక్షుడు గంగాధర్‌గౌడ్, సర్పంచుల ఫోరం మండల అధ్యక్షుడు వెంకటేశ్వర్‌రావు, విండో ఛైర్మన్ అశోక్, సీనియర్ నాయకులు పురుషోత్తం, రాజేశ్వర్, రాజేందర్, డానియల్, లచ్చారెడ్డి తదితరులు పాల్గొన్నారు.



లబ్ధిదారులను సన్మానిస్తున్న దయాకర్‌రావు

వేల్పూర్, న్యూస్‌టుడే : అర్హులైన నిరుపేదలకు ఇందిరమ్మ ఇళ్లు అందేలా చూస్తామని కాంగ్రెస్ మండల కన్వీనర్ రంగు అనిల్‌గౌడ్ సూచించారు. ఆదివారం వేల్పూర్‌లో తులసీ ఇందిరమ్మ గృహప్రవేశ కార్యక్రమంలో పాల్గొన్నారు. నాయకులు రాజేందర్, రమణ, నరేందర్, హరికిషన్, మల్లేష్ పాల్గొన్నారు.

సంతమల్లన్నకు నైవేద్యాలు



ఆలయంలో బారులు తీరిన భక్తులు

అంక్సాపూర్(వేల్పూర్), న్యూస్‌టుడే : అంక్సాపూర్‌లోని సంతమల్లన్న స్వామికి ఆదివారం భక్తులు నైవేద్యాలు సమర్పించారు. శ్రావణమాసంలో సంతమల్లన్న స్వామి ప్రత్యేక దీక్షలు చేపట్టడం, నైవేద్యాలు సమర్పించడం ఆనవాయితీ. వేల్పూర్, వెంకటాపూర్, కోమన్‌పల్లి, కుకునూర్, అంక్సాపూర్ గ్రామకమిటీల ఆధ్వర్యంలో ప్రజలు ఊరేగింపుగా సంతమల్లన్న గుట్టకు చేరుకున్నారు. స్వామి వారికి మొక్కులు తీర్చుకున్నారు.

నర్సరీలకు అనుమతి తప్పనిసరి

కమ్మర్‌పల్లి(ఆర్మూర్), న్యూస్‌టుడే: ఆర్మూర్ డివిజన్‌లో కొత్తగా కూరగాయల నర్సరీలు పెట్టుకోవాలనుకునే, లీజుకు తీసుకున్న యజమానులు తప్పనసరిగా అనుమతులు తీసుకోవాలని రాష్ట్ర ఉద్యానశాఖ సూచించింది. అనుమతులు లేకుండా నిర్వహిస్తే కేసులు నమోదు చేస్తామని హెచ్చరించింది.

దరఖాస్తు ఇలా...

ఉద్యానశాఖ విస్తరణ అధికారి కార్యాలయం నుంచి దరఖాస్తు ఫారం తీసుకోవాలి. ఎస్‌బీఐలో నిర్ణీత రుసుము చెల్లించి రసీదు పొందాలి. ఎకరాకు రూ.2500 చలానా కట్టాల్సి ఉంటుంది. పూర్తి చేసిన దరఖాస్తు పత్రానికి బ్యాంకులో చెల్లించిన రసీదును జత చేయాలి. వాటిని స్థానిక ఉద్యానశాఖ విస్తరణ అధికారికి సమర్పించాలి. పట్టాదారు పుస్తకం, ఆధార్‌కార్డు, మట్టి, నీటి పరీక్ష నివేదికలు, రైతు ఒప్పంద పత్రం, గ్రామ పంచాయతీ ఆమోద పత్రం, నర్సరీ యజమాని ఆధార్ కార్డు దరఖాస్తుకు జత చేయాల్సి ఉంటుంది.

హెల్మెట్ ధరిస్తేనే ప్రాణాలకు రక్ష



ఆర్మూర్, న్యూస్‌టుడే: హెల్మెట్ ధరించడంపై అవగాహన కల్పించడంతో పాటు పర్యావరణ పరిరక్షణకు తనవంతు కృషి చేస్తున్నారు ఆర్మూర్ పట్టణ సామాజిక సేవకుడు పట్వారీ తులసీకుమార్. ఆదివారం హెల్మెట్ లేకుండా ప్రయాణిస్తున్న వాహనదారులకు మొక్కలు అందజేస్తూ హెల్మెట్ ధరించాలని సూచించారు. హెల్మెట్ ధరించడం ద్వారా ప్రాణాలకు రక్షణ ఉంటుందన్నారు.

వాహనదారుడికి మొక్క అందిస్తున్న తులసీకుమార్

కార్మికులకు దుస్తులు అందజేత

నందిపేట్, న్యూస్‌టుడే: నందిపేట్‌లోని పారిశుద్ధ్య కార్మికులకు ఆదివారం గ్రామానికి చెందిన మంద శ్రావణి దుస్తులు అందజేశారు. ఏటా తన పుట్టిన రోజు సందర్భంగా సహాయ కార్యక్రమాలు చేస్తారు. నాయకులు మంద మహిపాల్, ఇతరులు పాల్గొన్నారు.

వ్యవసాయ క్షేత్రం సందర్శన

నిజామాబాద్ వ్యవసాయం, న్యూస్‌టుడే: కృష్ణా జిల్లా చల్లపల్లి మండలం రాముడుపాలెం గ్రామానికి చెందిన రైతులు నిజామాబాద్ జిల్లా కేంద్రానికి చెందిన రైతు చిన్ని కృష్ణుడు వ్యవసాయ క్షేత్రాన్ని ఆదివారం సందర్శించారు. చిన్ని కృష్ణుడు సేంద్రియ పద్ధతిలో పండించే విధానాన్ని తెలుసుకున్నారు. ఆయన ఉపయోగించే వరి వంగడాలు, సాగు విధానాన్ని వివరించారు.

విగ్రహ ప్రతిష్ఠాపన ఉత్సవాలు

జక్రాన్‌పల్లి, న్యూస్‌టుడే: మండలంలోని కలిగోట్ గ్రామంలో నూతనంగా నిర్మించిన శ్రీరాధాకృష్ణ ఆలయంలో ఆదివారం విగ్రహ ప్రతిష్ఠాపన ఉత్సవాలు వైభవంగా నిర్వహించారు. ఇందులో భాగంగా గ్రామంలో రాధాకృష్ణ విగ్రహాల ఊరేగింపు చేపట్టారు. యజ్ఞం నిర్వహించి భక్తులకు అన్నదానం చేశారు. గ్రామానికి చెందిన శ్రీకృష్ణ యాదవ సంఘం, యువజన సంఘం ఆధ్వర్యంలో రూ.10 లక్షలతో ఈ ఆలయం నిర్మించారు. కార్యక్రమంలో సర్పంచి నాయకరాజు, ఉప సర్పంచి సత్యమ్మ, యాదవ సంఘం సభ్యులు ప్రశాంత్, మోహన్, నర్సయ్య, శ్రీను, గంగాధర్, రాము తదితరులు పాల్గొన్నారు.

అధ్వానంగా ఆలూర్ బైపాస్ రోడ్డు

ఆలూర్ మండల కేంద్రం నుంచి దేగాం, మచ్చర్ల మార్గంలోని బైపాస్ రోడ్డు ప్రమాదకరంగా ఉంది. పెద్ద గుంతలు ఏర్పడ్డాయి. లోతట్టు ప్రాంతం కావడంతో గ్రామంలోని మురుగు నీరు, వర్షపు నీళ్లు గుంతల్లో నిలుస్తున్నాయి. ద్విచక్ర వాహనాలు ఈ మార్గంలో వెళ్లలేని పరిస్థితి ఏర్పడి నిరుపయోగంగా తయారైంది. ఈ ప్రాంతంలో మురుగు, వర్షం నీళ్లు నిల్వకుండా వంతెన నిర్మించాల్సిన అవసరం ఉంది.



ఆర్మూర్ గ్రామీణం, న్యూస్‌టుడే

పీఆర్టీయూ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులుగా శంకర్, కిషన్

నిజామాబాద్ విద్యావిభాగం, న్యూస్‌టుడే: పీఆర్టీయూటీఎస్ జిల్లా కార్యవర్గ ఎన్నికలు జిల్లాలోని న్యూ అంబేడ్కర్ భవన్‌లో ఆదివారం ప్రశాంతంగా జరిగాయి. జిల్లావ్యాప్తంగా 33 మండలాలకు చెందిన కార్యవర్గ సభ్యులంతా ఓటు హక్కు వినియోగించుకున్నారు. మొత్తం 366 మందికి గాను 359 మంది ఓటువేశారు. జిల్లా అధ్యక్ష పదవికి పోటీపడిన పొద్దుటూరి మోహన్‌రెడ్డిపై అంబెల్లి శంకర్ 11 ఓట్ల మెజారిటీతో గెలిచారు. ప్రధాన కార్యదర్శి పదవికి బరిలో దిగిన వెంకటేశ్వర్ గౌడ్‌పై కిషన్ పైచేయి సాధించి విజేతగా నిలిచారు. ఈయన రెండోసారి నెగ్గారు. అసోసియేట్ అధ్యక్షులుగా అంకం నరేష్, శ్రీనివాస్, మహిళా అసోసియేట్ అధ్యక్షులుగా ఇందూర్ లలిత, సీహెచ్ వరలక్ష్మి, ఉపాధ్యక్షులుగా శ్రీనివాస్‌గౌడ్, సాయన్న, రాజశేఖర్, హన్మాండ్లు, మనోహర్‌రావు, మహిళా ఉపాధ్యక్షులుగా ఆశారాణి, సుజాత, కార్యదర్శులుగా శ్రీనివాస్, గోపాల్, రవి, రామకృష్ణ, కపిల్‌కుమార్, మహిళా కార్యదర్శులుగా శ్రీదేవి, రచనమహా గోయెంకర్ గెలుపొందారు. ఉపాధ్యాయ సమస్యల పరిష్కారానికి నిత్య పోరాటం సాగిస్తామని నూతన అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఈ సందర్భంగా వెల్లడించారు.